

మరో 8 కరోనా కేసులు

మహరాణిపేట, జనవరి 4: జిల్లాలో గురువారం మరో ఎనిమిది కరోనా కేసులు నమోదయ్యాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 73 మందికి ఆర్‌టీపీఆర్ పరీక్షలు నిర్వహించగా వారిలో ఎనిమిది మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు అధికారులు వెల్లడించారు. వీటితో మొత్తం కేసుల సంఖ్య 52కు చేరింది. ప్రస్తుతం 38 మంది వైరస్‌తో బాధపడుతున్నారు. వీరిలో 30 మంది వరకూ హోమ్ ఐసోలేషన్‌లో ఉండగా మిగిలినవారు ఆస్పత్రిలో చేరారు. కొవిడ్ కేసులు పెరుగుతున్నందున మార్కెట్లు, రద్దీ ప్రాంతాలకు వెళ్లినప్పుడు మాస్కులు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

నేడు నగరంలో నారా భువనేశ్వరి పర్యటన

- చంద్రబాబునాయుడు అరెస్టయినప్పుడు మనోవేదనతో మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ
- ఆర్థిక సాయం పంపిణీ



గురువారం రాత్రి నగరానికి చేరుకున్న నారా భువనేశ్వరికి నోవాటెల్ హోటల్‌లో స్వాగతం

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి శుక్రవారం నగరంలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పర్యటించనున్నారని పార్టీ విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ అధినేత చంద్రబాబునాయుడిని ప్రభుత్వం అకారణంగా అరెస్టు చేసి జైలులో పెట్టడాన్ని తట్టుకోలేక మృతిచెందిన కార్యకర్తల కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేస్తారన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటిస్తున్న భువనేశ్వరి గురువారం రాత్రి నగరానికి చేరుకున్నారన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు నోవాటెల్ హోటల్ నుంచి బయలుదేరి తొలుత దక్షిణ నియోజకవర్గ పరిధిలోని 31వ వార్డులో గల వెంకటేశ్వర మెట్ట ప్రాంతంలో మృతిచెందిన ఎ.చిన్నా కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. ఆ తరువాత 10.30 గంటలకు జ్ఞానాపురంలో ఎం.రమణ ఇంటికి వెళ్లి అతని కుటుంబాన్ని కలుసుకుంటారన్నారు. అక్కడ నుంచి బయలుదేరి 10.55 గంటలకు విశాఖ ఉత్తర నియోజకవర్గ పరిధిలోని తాటిచెట్లపాలెంలో పి.కనకారావు కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. అనంతరం 11.35 గంటలకు గాజువాక నియోజకవర్గ పరిధిలోని 65వ వార్డులో కె.వెంకటరావు, ఉప్పలపాటి సరోజిని, షీలానగర్‌లో పమిడిముక్కల రాధాకృష్ణ (తెలుగుదేశం బాబాయ్)ల ఇళ్లకు వెళ్లి వారి కుటుంబాలను పరామర్శిస్తారని తెలిపారు. తరువాత మధ్యాహ్నం రెండు గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకుని హైదరాబాద్ బయలుదేరి వెళతారన్నారు. విలేకరుల సమావేశంలో దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి గండి బాబ్జీ పాల్గొన్నారు.

20 మంది సీఐల బదిలీలు

- ఎన్నికల నేపథ్యంలో ఒకేచోట మూడేళ్లకు పైబడి ఉన్నవారికి స్థానచలనం

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్‌లో 20 మంది సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఐజీ హరికృష్ణ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. నాలుగు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున ఒకేచోట మూడేళ్లకు మించి పనిచేస్తున్న సీఐలకు స్థానచలనం కల్పించారు. ఇంకా సొంత జిల్లాల్లో ఉండకూడదన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలను కూడా పరిగణనలోకి తీసుకున్నారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తూ రేంజ్ వేకెన్సీ రిజర్వులో ఉన్న సీఐలు రొక్కం రవిప్రసాద్, జి.రాంబాబు, సీహెచ్ శ్రీధర్‌లను విశాఖ నగరానికి కేటాయించారు. అలాగే జి.దేముళ్లను శ్రీకాకుళం పోలీస్ కంట్రోల్ రూమ్‌కు, వై.మురళీరావును విజయనగరం జిల్లా ఎస్.కోట యూపీఎస్‌కు, సీహెచ్ షణ్ముఖరావును ఎస్.కోట సర్కిల్‌కు, ఎన్వీ ప్రభాకరరావును గజపతినగరం సర్కిల్‌కు నియమించారు. అలాగే పి.రమణను అనకాపల్లి జిల్లా సబ్బవరం, బీసీహెచ్ స్వామినాయుడిని కె.కోటపాడు, నల్లి సాయిని శ్రీకాకుళం జిల్లా పాతపట్నం సీఐలుగా నియమించారు. విశాఖ సిటీలో పనిచేస్తున్న సీహెచ్ సూరినాయుడిని శ్రీకాకుళం డీసీఆర్‌బీకి, ఎం.అవతారాన్ని శ్రీకాకుళం ట్రాఫిక్‌కు, టి.ఇమ్మాన్యుయల్ రాజును శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ చేశారు. శ్రీకాకుళం ట్రాఫిక్‌లో పనిచేస్తున్న టి.కామేశ్వరరావు, ఎస్.కోట సీఐ ఎస్.బాలసూర్యారావు, అనకాపల్లి జిల్లా కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహ్మద్, సబ్బవరం సీఐ పి.రంగనాథంలను విశాఖ రేంజ్‌కు సరండర్ చేశారు. గజపతినగరం సీఐ ఎల్.అప్పలనాయుడిని అనకాపల్లి జిల్లా కొత్తకోట, పాతపట్నం సీఐ ఎం.వినోద్ బాబును కశింకోట సీఐలుగా, అనకాపల్లి జిల్లాలో ఉన్న కె.కుమార్‌స్వామిని అక్కడే సోషల్ మీడియా సైబర్ సెల్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

భారీగా ఎస్‌ఐల బదిలీ

- మూడేళ్లుగా పనిచేస్తున్న 17 మంది శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు...

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో మూడేళ్లకు పైబడి పనిచేస్తున్న 17 మంది ఎస్‌ఐలను విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు బదిలీ చేస్తూ సీపీ రవిశంకర్‌అయ్యన్నార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వారి స్థానంలో రేంజ్ నుంచి కొత్తగా 17 మందిని తీసుకున్నారు. నగర కమిషనరేట్ పరిధిలో స్టీల్‌ప్లాంట్ స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తున్న చుక్కా స్వామినాయుడు, టూటౌన్ ఎస్‌ఐగా పనిచేస్తున్న లుకవరపు చంద్రశేఖర్, పెందుర్తి ఎస్‌ఐగా పనిచేస్తున్న చిన్నంనాయుడు, గోపాలపట్నం క్రైమ్ ... మిగతా 6వ పేజీలో

వైసీపీలో ధిక్కార స్వరం

పార్టీలో పెరుగుతున్న అసంతృప్తులు

- నిన్న మొన్నటి వరకూ పార్టీ పెద్దల ఎదుట మాట్లాడేందుకే భయపడే పరిస్థితి
- ఏమాత్రం తేడా కనిపించినా సస్పెన్షన్లు
- ఇప్పుడు అందుకు విరుద్ధమైన వాతావరణం
- అధిష్ఠానం నిర్ణయాలను బహిరంగంగానే తప్పుబడుతున్న పలువురు నేతలు
- వాసుపల్లికి వ్యతిరేకంగా కార్పొరేటర్ల సమావేశం
- ఆయనకు టికెట్ ఇస్తే సహకరించబోమని ప్రకటన
- దేవన్‌రెడ్డి తొలగింపుపై సుబ్బారెడ్డి ఎదుటే అసంతృప్తి గళం
- ఎన్నికల వేళ అధిష్ఠానం అభద్రతా భావంలో ఉండడంతోనే చర్యలకు వెనకాడుతోందని పార్టీలో అభిప్రాయాలు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అధిష్ఠానం నిర్ణయమే అంతిమం...అన్నట్టుండే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. నిన్న మొన్నటి వరకూ పార్టీ నేతల ఎదుట నోరు విప్పేందుకే భయపడిన ద్వితీయ శ్రేణి నేతలు ఏకంగా ధిక్కారస్వరం వినిపిస్తున్నారు. తమకు ఇష్టం లేని నేతకు టికెట్ ఇస్తే సహకరించేది లేదంటూ బహిరంగంగానే ప్రకటనలు చేస్తున్నారు. అయినా అధిష్ఠానం చూస్తూ ఊరుకుండిపోవడం పార్టీ వర్గాలనే విస్మయపరుస్తోంది. పలువురు సీనియర్‌లు పార్టీని వీడి వెళ్లిపోతున్న తరుణంలో...సస్పెన్షన్ల పేరుతో మరికొంతమందిని బయటకు పంపడం ఎందుకనే ఉద్దేశంలో అధిష్ఠానం ఉన్నట్టుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లికి వ్యతిరేకంగా కార్పొరేటర్ల సమావేశం (ఫైల్ ఫొటో)



గాజువాక సమావేశంలో వైవీ సుబ్బారెడ్డి సమక్షంలో నాగిరెడ్డికి మద్దతుగా నినాదాలు (ఫైల్ ఫొటో)

2019 నుంచి పార్టీ పదవులతోపాటు నామినేటెడ్ పోస్టులను అధిష్ఠానం ఎవరికి కేటాయించినా ఎదురు చెప్పడంగానీ, తనకు ఇవ్వలేదని కినుక వహించడంగానీ ఇప్పటివరకూ వైసీపీలో లేదు. ఎవరైనా పార్టీ నిర్ణయానికి విరుద్ధంగా మాట్లాడినా, వ్యవహరించినా సస్పెండ్ చేస్తామని అధిష్ఠానం సంకేతాలు ఇచ్చింది. పార్టీలో కీలకంగా వ్యవహరించిన కొయ్య ప్రసాదరెడ్డి భూసెటిల్‌మెంట్‌లో తలదూర్చారనే ఆరోపణ రావడంతో సస్పెండ్ చేసింది. అలాగే పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌కు సహకరించడం లేదనే అభియోగంపై 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్‌ను సస్పెండ్ చేసింది. దీంతో అధిష్ఠానానికి, నియోజకవర్గ సమన్వయకర్తలకు ఏమాత్రం ఎదురుచెప్పినా, విభేదించినా క్రమశిక్షణా చర్యలకు గురవ్వాల్సి ఉంటుందనే భయం పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఉండేది. అందుకే పార్టీ నిర్ణయాల పట్ల, నేతల వ్యవహారశైలి పట్ల అసంతృప్తి ఉన్నప్పటికీ ఎవరూ బయటపడేవారుకాదు. అయితే ఎన్నికలు సమీపించేసరికి అధికార పార్టీలో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. తమకు ఇష్టంలేని నేతలకు టికెట్లు ఇస్తే వారి గెలుపునకు సహకరించేది లేదని ప్రెస్‌మీట్లు పెట్టి మరీ హెచ్చరిస్తున్నారు. దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌కు వ్యతిరేకంగా ఏడెనిమిది మంది కార్పొరేటర్లు సమావేశం కావడమే కాకుండా ఏకంగా అధిష్ఠానానికి లేఖ పంపారు. వాసుపల్లికి టికెట్ ఇస్తే తాము సహకరించబోమని అల్టిమేటం ఇచ్చారు. ఆ కార్పొరేటర్లను పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి పిలిచి మాట్లాడారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయాన్ని శిరసావహించాల్సిందేనని చెప్పగా...అందుకు కార్పొరేటర్లు ససేమిరా అన్నారు. తాము వాసుపల్లితో కలిసి పనిచేయలేమంటూ కుండబద్దలు కొట్టినట్టు చెప్పడంతో సుబ్బారెడ్డితోపాటు మిగిలిన నేతలు అవాక్కయ్యారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించని వారిపై క్రమశిక్షణాచర్యలు తప్పవంటూ అప్పటి నుంచి ప్రచారం జరుగుతోంది. అలాగే గాజువాకలో ఇటీవల నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో వైవీ సుబ్బారెడ్డి ఎదుటే ఎమ్మెల్యే నాగిరెడ్డి వర్గీయులు ఇన్‌చార్జి మార్పుపై తమ అసంతృప్తి వెలిబుచ్చారు. దేవన్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. సమావేశంలో గందరగోళం తలెత్తడంతో ... మిగతా 6వ పేజీలో

సమగ్ర శిక్ష ఉద్యోగులకు నోటీసులు

విశాఖ జిల్లాలో 120 మందికి...



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

- అనకాపల్లిలో కేజీబీవీ టీచర్లను తొలగిస్తున్నట్టు ప్రిన్సిపాళ్లకు సమాచారం?
- నేటి 'చలో విజయవాడ'కు వెళ్లొద్దని అధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల పరిష్కారం కోరుతూ రెండు వారాల నుంచి సమ్మె చేస్తున్న సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు, కేజీబీవీ టీచర్లను ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయిలో సెక్టోరియల్ అధికారుల వరకూ బెదిరిస్తున్నారు. విధులకు హాజరు కాకుంటే తొలగిస్తామంటూ హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లాలోని మూడు కేజీబీవీల్లో 40 మంది టీచర్లు గురువారం విధుల్లో చేరారు. శుక్రవారం నుంచి కొత్తవారితో బోధన చేయిస్తామని భయపెట్టడంతో విధిలేక వారంతా డ్యూటీలో చేరారని సమగ్ర శిక్ష ఉద్యోగుల జేఏసీ నేత ఒకరు పేర్కొన్నారు. ఇదిలావుండగా సమగ్రశిక్ష జిల్లా కార్యాలయం, మండల విద్యాశాఖాధికారి కార్యాలయాలు, ఉన్నత పాఠశాలల్లో పనిచేసే అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు 120 మందికి గురువారం విశాఖ జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు షోకాజ్ నోటీసులు జారీచేశారు. వారం రోజుల్లో విధులకు హాజరుకావాలంటూ 120 మందికీ పేరు పేరునా నోటీసులు ఇచ్చారు.

ఇదిలావుండగా అనకాపల్లి జిల్లాలో 20 కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) పనిచేసే సీఆర్‌టీ (టీచర్లు)లు విధులకు హాజరుకావడం లేదు. వారందరికీ వారం క్రితమే షోకాజ్ నోటీస్ జారీచేసినా కొద్దిమంది తప్ప మిగిలిన వారెవరూ విధులకు హాజరుకాలేదు. విధులకు రాని సీఆర్‌టీలకు తొలగించాలని విజయవాడలోని ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు విధుల నుంచి తొలగించినట్టు నోటీసులను నేరుగా సీఆర్‌టీలకు కాకుండా సంబంధిత కేజీబీవీ ప్రిన్సిపాళ్ల వాట్సాప్‌లకు పంపారని చెబుతున్నారు.

చలో విజయవాడకు ఉద్యోగులు

విజయవాడలోని సమగ్రశిక్ష రాష్ట్ర కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించాలని జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఉమ్మడి జిల్లా నుంచి భారీగానే ఉద్యోగులు బయలుదేరారు. అయితే విజయవాడ వెళ్లవద్దని సమగ్రశిక్ష అభియాన్ అధికారులు, పోలీసులు బెదిరిస్తున్నట్టు జేఏసీ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

కంపుకొడుతున్న నగరం



చెంగల్రావుపేట గొల్లల వీధిలో పేరుకుపోయిన చెత్త - వార్త I పేజీలో



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద శవాసనం వేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల వినూత్న నిరసన

సిరిపురం, జనవరి 4: అంగన్‌వాడీ సిబ్బంది నిరవధిక సమ్మె 24వ రోజుకు చేరుకుంది. గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వారంతా శవాసనం వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ చాలో కలెక్టరేట్‌లో పోలీసులు అతిగా వ్యవహరించి మహిళలపై విచక్షణారహితంగా ప్రవర్తించారన్నారు. అరెస్టుల సమయంలో అనేక మంది గాయపడ్డారని, మగ పోలీసులు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని ఆరోపించారు. 24 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం శవంలా వ్యవహరిస్తుండడంతో శవాసనంతో నిరసన తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు వై.తులసీ, గౌరవాధ్యక్షురాలు పి.మణి, నాయకులు ఆర్.శోభారాణి, ఎం.వెంకటలక్ష్మి, ఆర్.నాగేశ్వరి, రామలక్ష్మి, పూజిత, పార్వతి, నరసమయ్య, పాపవేణి, రాధారాణి, శ్యామల, ఎ.సత్య, బి.ఈశ్వరమ్మ, ఆర్.ఈశ్వరమ్మ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్కేఎస్వీ కుమార్ పాల్గొన్నారు.

ఎడాపెడా రైళ్ల రద్దు

రద్దీ సమయాల్లోను అదే తీరు

- ఇటు ప్రయాణికులకు కష్టం...అటు రైల్వేకు నష్టం
- భద్రత, మౌలిక వసతుల పనుల కోసమా? లేక కొత్త రైళ్లకు ఆక్యుపెన్సీ పెంచేందుకా??

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

కేంద్ర ప్రభుత్వం రైల్వేలో సొంత మార్కు కోసం యత్నిస్తూ ప్రయాణికులు బాగా అలవాటుపడిన సాధారణ రైళ్లను ఎడాపెడా రద్దు చేస్తోంది. ఆధునిక వసతులు, అత్యధిక వేగం పేరుతో కొత్త రైళ్లను తీసుకువచ్చి భారీగా ఆదాయం సమకూర్చుకుంటోంది. వందేభారత్ వంటి రైళ్లకు రద్దీ పెంచడానికి ఆ సమయంలో రెగ్యులర్‌గా నడిచే రైళ్లను తరచూ రద్దు చేస్తోంది. ఎక్కువ చార్జీలు అయినా సరే ప్రయాణికులు వాటినే ఆశ్రయించేలా చేస్తోంది. దీనికి అనేక సాకులు చూపుతోంది. రైల్వే లైన్లను ఆధునికీకరిస్తున్నామని, భద్రత, మౌలిక వసతుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అందుకే రైళ్లను రద్దు చేస్తున్నామని ప్రకటనలు ఇస్తోంది. పండుగలు, సెలవుల సమయాల్లో కూడా రెగ్యులర్ రైళ్లను రద్దు చేస్తుండడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్రమంగా ఆయా రైళ్లను సర్వీసు నుంచి తొలగిస్తారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.




అసలు రైళ్లు ఎందుకు రద్దు చేస్తున్నారు?, కారణాలు ఏమిటి?, గత ఏడాది మే నుంచి విశాఖపట్నం నుంచి బయలుదేరే రైళ్లను ఎన్నిసార్లు రద్దు చేశారో వివరాలు కావాలంటూ దువ్వాడ రైల్వే వినియోగదారుల సంఘం ప్రతినిధి కంచుమూర్తి ఈశ్వర్ సమాచార హక్కు చట్టం కింద ప్రశ్నించినప్పుడు వాల్తేరు డివిజన్ అధికారులు కళ్లు చెదిరిపోయే వివరాలు అందించారు. విశాఖపట్నం నుంచి కాకినాడ, గుంటూరు, మచిలీపట్నం, విజయవాడ, హైదరాబాద్, తిరుపతిల మధ్య తిరిగే రెగ్యులర్ రైళ్లను కొన్ని వందలసార్లు రద్దు చేసినట్టు వెల్లడించారు. వీటి వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు కలగడగంతో పాటు రైల్వే ఆదాయానికి కూడా భారీగా గండి పడింది.

మే 2023 నుంచి డిసెంబరు 17 వరకు రద్దు చేసిన రైళ్ల వివరాలు

- మచిలీపట్నం-విశాఖపట్నం-మచిలీపట్నం మధ్య 17219/20 నంబరుతో నడిచే రైలును తూర్పు కోస్తా ... మిగతా 6వ పేజీలో

పెందుర్తి ఏఎస్‌ఐ మురహరి సస్పెన్షన్

- దుకాణాల యజమానులపై దాడి చేసినందుకు చర్యలు... కేసు కూడా నమోదు



ఏఎస్‌ఐ మురహరి

విశాఖపట్నం/పెందుర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి స్టేషన్‌లో ఏఎస్‌ఐగా పనిచేస్తున్న మురహరిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సీపీ రవిశంకర్ అయ్యన్నార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల రెండో తేదీ రాత్రి 11 గంటల సమయంలో పెందుర్తి జంక్షన్‌లో దుకాణాలను తెరిచి ఉంచారనే కారణంతో యజమానులతోపాటు సిబ్బందిని ఏఎస్‌ఐ మురహరి చితకబాదారు. షట్టర్లు దించేశామని సామగ్రి సర్దుకుంటున్నామని సిబ్బంది బతిమిలాడినా కనికరించలేదు. ఏఎస్‌ఐ లాఠీ దాడిలో గాయపడిన సిబ్బంది స్థానిక సీహెచ్‌సీలో చికిత్స తీసుకున్న అనంతరం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ దాష్టీకంపై గురువారం పత్రికల్లో వార్తలు రావడంతో పోలీస్ కమిషనర్ విచారణకు ఆదేశించారు. సీఐ మరిడాన శ్రీనివాసరావు ఇచ్చిన నివేదిక మేరకు ఏఎస్‌ఐను సస్పెండ్ చేశారు. అదేవిధంగా ఏఎస్‌ఐ మురహరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ మరిడాన ... మిగతా 6వ పేజీలో

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, జనవరి 4: నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు.సాయిబాబాఆలయం, ఎస్ఎఫ్ఎస్ స్కూల్, ఎస్ఆర్ఐ ఆస్పత్రి రోడ్డు, కృష్ణ మందిర్ రోడ్డు, కెనరా బ్యాంక్, ఆర్కేనగర్, వసంత విహార్, ప్రెసిడెన్షియల్ స్కూల్, వెలమ భవన్, బీఎస్ లే అవుట్ ఏరియాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెత్త కుప్పలను తొలగించండి

జ్ఞానాపురం, జనవరి 4: పారిశుధ్య కార్మికుల సమ్మెతో పదిరోజులుగా పేరుకుపోయిన చెత్త కుప్పలను తక్షణమే డంపింగ్ యార్డులకు తరలించాలని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ శానిటరీ ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. జ్ఞానాపురం, రైల్వేస్టేషన్, కంచరపాలెం ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించి, పారిశుధ్య పరిస్థితిని పరిశీలించారు. అవసరమైన చోట రోజు వారి కూలి పద్ధతిలో కార్మికులను నియమించకుని పనులు జరిగేలా చూసుకోవాలన్నారు.


పుష్పాలంకరణలో కన్యకాపరమేశ్వరి


ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి విశేష పూజలు

మహారాణిపేట, జనవరి 4: వన్టౌన్లోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మార్గశిర గురువారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం 108 బంగారు పుష్పాలతో పూజించారు. తెల్లవారుజాము నుంచీ జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సూమారు 300 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్రనామ పారాయణం చేశారు. అన్న ప్రసాదాలను అందించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధ్య టక్ష, కార్యదర్శులు ఆరిశెట్టి దినకర్ గ్రంధి రామకృష్ణారావు, సుగుణ శివకుమార్ ఏర్పాట్లు చేశారు.

మహిళా సాధికారతే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

» మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు


కళాశాలలో మొక్కలు నాటుతున్న హరిబాబు

డాబాగార్డెన్స్, జనవరి 4: మహిళా సాధికారతే ప్రధాని మోదీ లక్ష్యమని మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాల నూతన విద్యార్థుల వేడుకలకు గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కళాశాల వ్యవస్థాపకులు శృంగవరపు సూర్యారావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజల్వన అనంతరం సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేసి కళాశాల ఆవరణలో పూలమొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో 65 శాతం యువత ఉన్నారన్నారు. జాతీయ విద్యావిధానం రూపొందించిన ప్రధాని మహిళల్లోని నైపుణ్యాన్ని వెలికితీసి, స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం మెరిట్ విద్యార్థులకు గవర్నర్ పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శోభారాణి అధ్యక్షత వహించగా వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, అరుణపద్మ, గీతాంజలి, అనురాధ, ధరణి, శర్మ, కల్యాణిరామ్, రాజు, రూపాకుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరి పర్యటన ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

అక్కయ్యపాలెం, జనవరి 4: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జైలులో ఉన్న సమయంలో తీవ్ర దిగ్భ్రాంతి, ఆందోళనకు గురై మృతిచెందిన 45వ వార్డు తాటిచెట్లపాలెం ప్రాంతానికి చెందిన మంచిరెడ్డి కనకారావు కుటుంబసభ్యులను చంద్రబాబు సతీమణి భువనేశ్వరి శుక్రవారం పరామర్శిస్తారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం నాయకులతో కలిసి మృతుని ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి నిజం గెలవాలి యాత్రలో భాగంగా భువనేశ్వరి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంటన నియోజకవర్గ ఇన్చార్జి విజయ్బాబు, నేతలు భరణికాన రాజు, నరేంద్ర, షేక్ బాబ్జీ, వాసుపల్లి రాజు, గొలగాని సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షునికి సత్కారం


శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, జనవరి 4: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా గౌరవాధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన ఎన్జీజీఓస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావును ఉపాధ్యాయులు గురువారం సత్కరించారు. హెచ్ఎం బి.లక్ష్మీనరస మాట్లాడుతూ శ్రీనివాసరావు గతంలో విశాఖ అర్బన్ అధ్యక్షునిగా, వర్కింగ్ ప్రెసిడెంట్గా సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిశోర్, ఎంవీ ధర్మారావు, మాణిక్యం, ఎ.సునంద్, ఎంఎస్ విశ్వనాథ్, జ్యోతి, లలిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

జగన్ను నమ్మి మోసపోయిన మంత్రి అమర్నాథ్

» జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న మూర్తియాదవ్

సీతమ్మధార, జనవరి 4: గొర్రె కసాయిని నమ్మినట్టు మంత్రి గుడివాడ అమర్నాథ్ జగన్ను నమ్మి దారుణంగా మోసపోయారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రకాలుగా నాశనం చేసిన జగన్, చివరికి నమ్మకంగా ఉండి నోటికి ఏది వస్తే అది మాట్లాడే అమర్నాథ్ లాంటి వారిని కూడా మోసం చేశారన్నారు. లారీలకు కప్పం వసూలు చేయడం, ఫార్మా కంపెనీలతో బొగ్గు వ్యాపారం చేయడం, అయినకాడికి భూములను దోచేయడం లాంటి వ్యవహారాలు నడిపిన అమర్నాథ్కు తగిన శాస్తి జరిగిందన్నారు. ప్రతిరోజూ పవన్ కల్యాణ్ను తిట్టడమే పనిగా పెట్టుకున్న అమర్నాథ్ గురువారం అనకాపల్లిలో కన్నీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితికి వచ్చారని ఎద్దేవా చేశారు. విస్సన్నపేటలో 609 ఎకరాల అక్రమ లే అవుట్తో రూ.వేల కోట్ల భూ కుంభకోణానికి తెరలేపారన్నారు. ఆర్ఈసీఎస్ పేరిట సుమారు రూ.200 కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. అమాయకులైన 35 మందిని ఉద్యోగాల పేరుతో మోసం చేశారన్నారు. అనకాపల్లిలో క్వారీలు, క్రషర్ల నుంచి దోచేశారన్నారు. ఎన్నో అక్రమాలకు పాల్పడిన అమర్నాథ్కు తగిన గుణపాఠం దక్కిందన్నారు.

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్

కంచరపాలెం, జనవరి 4: పలు అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి గురువారం శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ 55వ వార్డు జామవానగర్, రెడ్డికంచరపాలెంలో బీటీ రోడ్లు, కాలువలు, డ్రైన్లు నిర్మాణానికి జీవీఎంసీ రూ.1.48 కోట్లు కేటాయించింది. పనులను గురువారం ఉత్తర వైసీపీ ఇన్చార్జి కేకేరాజుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, కార్పొరేటర్ కేవీఎస్ శశికళ, డీఈ భరణి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి 55వ వార్డు అధ్యక్షుడు రాజీనామా

కంచరపాలెం, జనవరి 4: గ్రేటర్ 55వ వార్డు వైసీపీ అధ్యక్షుడు యర్రంశెట్టి శ్రీనివాసరావు తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి గురువారం రాజీనామా చేశారు. పదవులు, నామినేటెడ్ పోస్టు గానీ ఇవ్వకపోవడంతో మనస్తాపంతో పార్టీని వీడుతున్నా నన్నారు. అభిమానుల అభిప్రాయం మేరకు భవిష్యత్తు నిర్ణయం తీసుకుంటానన్నారు.

బైజూస్పై దాడి కేసులో ఐదుగురి అరెస్టు

సీతంపేట, జనవరి 4: ద్వారకానగర్లోని బైజూస్ సెంటర్పై దాడి కేసులో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ ఎరిపల్లి రాంబాబు, అధ్యక్షుడు కెంగువ అచ్యుతరావు, కార్యదర్శి ఉల్లం నాగరాజు, ఎరిపల్లి సాయిబాబు, గుర్రాల ఎర్రయ్యలను ఇన్చార్జి సీఐ సోమశేఖర్ అరెస్టు చేశారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

సీతంపేట, జనవరి 4: రైల్వే న్యూకాలనీ రామాలయం వీధిలో ఉంటున్న పి.ఖలీల్ ఖాన్ (67) బుధవారం నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు అందింది. పాల ప్యాకెట్ విషయమై జరిగిన గొడవతో వెళ్లిపోయిన తన భర్త తిరిగి రాలేదని అతడి భార్య భార్య నజీర్ బేగం ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వెంకటరావు కేసు నమోదు చేశారు.

మంత్రి అమర్నాథ్ కంటతడి

» అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్ పరిచయ కార్యక్రమంలో భావోద్వేగం


సమావేశంలో కంటతడి పెట్టిన మంత్రి అమర్నాథ్

అనకాపల్లి టౌన్, జనవరి 4: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ భావోద్వేగానికి లోనయ్యారు. కంటతడి పెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... ప్రస్తుతం ఆయన అనకాపల్లి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే రెండు రోజుల క్రితం వైసీపీ అధిష్ఠానం నియోజకవర్గ సమన్వయకర్తగా మలసాల భరత్కుమార్ను నియమించింది. అమర్నాథ్కు ఏ నియోజకవర్గం కేటాయించలేదు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి అనకాపల్లిలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగిన భరత్ పరిచయ కార్యక్రమంలో మంత్రి ఉద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. అనకాపల్లి ప్రజలు తనపై చూపిన అభిమానాన్ని, ఆప్యాయతను మరిచిపోలేక బాధను దిగమింగుకుంటున్నానన్నారు. తల్లిదండ్రులు తనకు జన్మనిస్తే, అనకాపల్లి ప్రజలు రాజకీయ పునర్జన్మను ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ సమన్వయకర్తగా నియమితులైన మలసాల భరత్కుమార్ను ఆదరించాలని మంత్రి కోరారు. తనకు ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ఏ బాధ్యత అప్పగిస్తే దానిని నిర్వహిస్తానన్నారు. ఆయన ఆదేశాల మేరకు తాను పనిచేయాల్సి ఉంటుందన్నారు. కాగా, అమర్నాథ్ ఎలమంచిలి, చోడవరం, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లో ఏదో ఒకచోట నుంచి పోటీ చేయాలని అమర్నాథ్ భావిస్తున్నారు. అయన ప్రయత్నాలు ఎంతవరకూ ఫలిస్తాయో చూడాలి. ఆయన్ను అనకాపల్లి లోక్సభ స్థానానికి పోటీ చేయించే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

అంగన్వాడీలపై పోలీసు చర్యలు దారుణం

» ధ్వజమెత్తిన సీఐటీయూ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సిటూ నేతలు

జగదాంబ కూడలి, జనవరి 4: న్యాయమైన కోర్కెల సాధనకు సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై పోలీసులు దాష్టీకం ప్రదర్శించడం హేయమైన చర్యని సీఐటీయూ నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు సిటూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఆర్కేఎస్వీ రవికుమార్ మాట్లాడుతూ అంగన్వాడీ సిబ్బంది గత 24 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పైగా పోలీసులతో నిర్బంధించాలని చూడడం పిరికిపంద చర్యగా అభివరించారు. చలో కలెక్టరేట్కు పెద్దఎత్తున అంగన్వాడీలు తరలిరావడంతో వారిపై పోలీసులు దారుణంగా దాడిచేయడంపై ఆయన విరుచుకుపడ్డారు. పోలీసు నిర్బంధాలతో ఉద్యమాలను అడ్డుకోవడం అన్యాయమని హెచ్చరించారు. అంగన్వాడీలను మగ పోలీసులతో నిర్బంధించడం దారుణమన్నారు. మునిసిపల్ కార్మికులు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసనలను అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందని, దీనికి తగిన ఫలితాన్ని అనుభవిస్తుందన్నారు. ఈ చర్యలను సిటూ తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. సమావేశంలో వై.తులసి, జి.అప్పలరాజు, ఎం.సుబ్బారావు, పి.మణి ఆర్.శోభారాణి పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖలో అడ్డగోలు పదోన్నతులు

» రోస్టర్ పాయింట్స్లో అక్రమాలపై ఆర్డీకి పలువురి ఫిర్యాదు

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో పలువురు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే విషయంలో అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టాఫ్ నర్సు నుంచి హెడ్నర్సుగా ఐదుగురికి పదోన్నతులు కల్పించేందుకు ఎస్ఆర్లను పిలిచారు. వారిలో ఒకామెకు అడ్డగోలుగా పదోన్నతి కల్పించేందుకు రోస్టర్ పాయింట్స్ మార్చారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పలువురు ఆర్డీని కలిసి వినతిపత్రం సమర్పించారు. నిబంధనలకు విరుద్ధంగా రోస్టర్ పాయింట్స్ రూపొందించి అనర్హురాలికి పదోన్నతి కల్పించేందుకు సీనియర్ అసిస్టెంట్తో పాటు మరో ఉన్నతాధికారి ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణ చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు కలెక్టర్ను కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

చిన్నారులు భవిష్యత్తు ఫుట్బాలర్లగా ఎదగాలి

» అకాడమీ ప్రారంభోత్సవంలో డాక్టర్ ఆదినారాయణ


ప్రారంభోత్సవంలో చిన్నారులతో నిర్వాహకులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 4: చిన్నారి ఫుట్బాలర్ల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని పద్మశ్రీ డాక్టర్ ఎస్వీ.ఆదినారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాజీ ఫుట్బాలర్ పి.కొండలరావు జయంతి సందర్భంగా స్టార్ ఫెక్స్ ఫుట్బాల్ క్లబ్ జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గురువారం అకాడమీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన విశాఖ ఫుట్బాల్ క్రీడారంగం కొద్దికాలంగా మసక బారిందని, చిన్నారి క్రీడాకారుల ద్వారా పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన చివరి ఫుట్బాలర్గా కొండలరావు గుర్తింపు పొందారన్నారు. కోచ్గా 150 మందిని తీర్చిదిద్దిన ఆయన అకాల మరణం బాధాకరమన్నారు. ఆయన స్ఫూర్తితో ఫుట్బాల్ అకాడమీని ప్రారంభించిన స్టార్ ఫెక్స్ క్లబ్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ కోచ్ శేషుమోహన్, నిర్వాహకులు త్రినాథరావు (బాబు), సన్నీ, పాల్గొన్నారు.


జయహో బీసీ పేరిట తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో జరిగిన సదస్సులో మట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

వైసీపీలో ధిక్కార స్వరం

... 5వ పేజీ తరువాయి

వైవీ సుబ్బారెడ్డి అక్కడ నుంచి నిష్క్రమించారు. అయితే అధిష్ఠానం నిర్ణయాలను నగరంలో పలువురు నాయకులు బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నా కనీసం షోకాజ్ నోటీసు ఇవ్వకపోవడం పార్టీ నేతలతోపాటు కార్యకర్తలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. గతంలో సమన్వయకర్త ఆదేశాన్ని పాటించలేదని ఒక కార్పొరేటర్ను సస్పెండ్ చేశారు. ఇప్పుడు పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త ఎదుట ధిక్కార స్వరం వినిపించినా కనీస చర్యలు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే కీలక పదవుల్లో ఉన్నవారు, ముఖ్యనేతలు, కార్పొరేటర్లు ఇతర పార్టీల్లోకి వలస పోతుండడంతో పార్టీ నేతలు ఆత్మరక్షణలో పడిపోయారని, ఇప్పుడు కొత్తగా ఎవరినైనా సస్పెండ్ చేస్తే మరింత ఇబ్బంది తలెత్తుతుందనే ఉద్దేశంతోనే చర్యలకు వెనుకడుగు వేస్తున్నట్టున్నారని పార్టీనేతలు కొందరు అభిప్రాయపడుతున్నారు. ఏదిఏమైనా వైసీపీలో ఆరు నెలలు కిందటి పరిస్థితికి పూర్తిభిన్నమైన వాతావరణం ఇప్పుడు ఉందని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు.

భారీగా ఎస్ఐల బదిలీ

... 5వ పేజీ తరువాయి

ఎస్ఐగా పనిచేస్తున్న కరణం వెంకటసురేష్, ఆరిలోవ స్టేషన్లో ఎస్ఐగా పనిచేస్తున్న బరుకు అనిల్కుమార్, హార్బర్ క్రైమ్ ఎస్ఐగా పనిచేస్తున్న డి.సూరిబాబు, త్రీటౌన్ ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేస్తున్న కె.నరసింగరావు, మల్కాపురం క్రైమ్ ఎస్ఐగా పనిచేస్తున్న పీడీబీ శంకర్, సీసీఎస్ ఎస్ఐగా పనిచేస్తున్న కె.సత్యనారాయణ, గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేస్తున్న కోటమహంతి శ్రీనివాసరావు, సీసీఎస్ ఎస్ఐగా పనిచేస్తున్న పీవీ రమణారెడ్డి, త్రీటౌన్ క్రైమ్ ఎస్ఐగా పనిచేస్తున్న ఎంవీ రమణ, ఎయిర్పోర్ట్ క్రైమ్ ఎస్ఐగా పనిచేస్తున్న డి.రాము, ఫోర్త్టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న ఎ.మోహనరావు, దువ్వాడ ఎస్ఐగా పనిచేస్తున్న కె.దేముడునాయుడు, పీఎంపాలెం ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేస్తున్న పి.మురళీకృష్ణను శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు బదిలీచేశారు. వారి స్థానంలో రేంజ్లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి మరో 17 మంది ఎస్ఐలను నగరానికి తీసుకున్నారు. వీరికి ఇంకా పోస్టింగ్లు ఇవ్వాల్సి ఉంటుంది.

ఎడాపెడా రైళ్ల రద్దు

... 5వ పేజీ తరువాయి

రైల్వే 13 సార్లు రద్దు చేయగా, దక్షిణ మధ్య రైల్వే 169 సార్లు రద్దు చేసింది.

» కాకినాడ-విశాఖపట్నం-కాకినాడల మధ్య 17267/68 నంబరుతో నడిచే రైలును తూర్పు కోస్తా రైల్వే 14 సార్లు, దక్షిణ మధ్య రైల్వే 284 సార్లు రద్దు చేశాయి.

» తిరుపతి-విశాఖపట్నం-తిరుపతి మధ్య 22708/707 నంబరుతో తిరిగే రైలును తూర్పు కోస్తా రైల్వే 2 సార్లు, దక్షిణ మధ్య రైల్వే 34 సార్లు రద్దు చేశాయి.

» విశాఖపట్నం-విజయవాడ-విశాఖపట్నం మధ్య 12717/718 నంబరుతో నడిచే రత్నాచల్ ఎక్స్ప్రెస్ను దక్షిణ మధ్య రైల్వే 59 సార్లు రద్దు చేసింది.

» సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్ల మధ్య 12740/39 నంబరుతో నడిచే గరీబ్రథ్ రైలును దక్షిణ మధ్య రైల్వే 271 సార్లు రద్దు చేసింది.

» విశాఖపట్నం-లింగంపల్లి-విశాఖపట్నం మధ్య నడిచే జన్మభూమి ఎక్స్ప్రెస్ రైలును దక్షిణ మధ్య రైల్వే 44 సార్లు రద్దు చేసింది.

» గుంటూరు-విశాఖపట్నం-గుంటూరు మధ్య 17239/240 నంబరుతో నడిచే సింహాద్రి ఎక్స్ప్రెస్ రైలును తూర్పు కోస్తా రైల్వే 2 సార్లు, దక్షిణ మధ్య రైల్వే 284 సార్లు రద్దు చేశాయి

» విశాఖపట్నం-విజయవాడ-విశాఖపట్నం మధ్య నడిచే డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్ప్రెస్ను తూర్పు కోస్తా రైల్వే కేవలం రెండుసార్లు రద్దు చేయగా, దక్షిణ మధ్య రైల్వే 264 సార్లు రద్దు చేసింది.

విమర్శల నేపథ్యంలో రెండు రైళ్ల తాత్కాలిక పునరుద్ధరణ

రైల్వే శాఖ తీరుపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తడంతో ఈ సంక్రాంతి సీజన్ కోసమని రెండు రైళ్లను తాత్కాలికంగా పునరుద్ధరించింది. విశాఖపట్నం-విజయవాడ మధ్య నడిచే డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్ప్రెస్ను ఈ నెల 5 నుంచి 13వ తేదీ వరకు నడుపుతామని ప్రకటించింది. అలాగే సింహాద్రి ఎక్స్ప్రెస్ను 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నడుపుతామని షెడ్యూల్ ఇచ్చారు. ఇవి కూడా తాత్కాలికంగానే నడపడం గమనార్హం.

పెందుర్తి ఏఎస్ఐ మురహరి సస్పెన్షన్

... 5వ పేజీ తరువాయి

శ్రీనివాసరావు తెలిపారు. కాగా పెందుర్తి పోలీసు స్టేషన్ సర్కిల్ పరిధిలో రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు (వీఆర్కు క్రైమ్ ఎస్ఐ సల్మాన్బేగ్ సరండర్, ఏఎస్ఐ మురహరి సస్పెన్షన్) వేటు పడడంతో ఇక్కడి పోలీసులు కలవరపడ్డారు.

ఎస్ఐను వీఆర్తో వదిలేయడంపై ఆశ్చర్యం

ఇదిలావుండగా ఇనుము చోరీ కేసులో లారీని విడిచిపెట్టేందుకు రూ.3.5 లక్షలు తీసుకున్నట్టు ఆరోపణలు ఎదుర్కొన్న పెందుర్తి క్రైమ్ ఎస్ఐను సస్పెండ్ చేయకుండా వీఆర్కు సరెండర్ చేసి వదిలేయడంపై పోలీస్ శాఖలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇనుముతోపాటు లారీని కూడా బాధితులు పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా లంచం తీసుకోవడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమంటున్నారు. పోలీస్ శాఖకు మచ్చతెచ్చేలా వ్యవహరించిన ఎస్ఐపై చర్యలు తీసుకోకుండా వదిలేస్తే మిగిలిన సిబ్బందికి ఎలాంటి సంకేతాలు వెళతాయో ఆలోచించాలని అంటున్నారు. సీపీని కొంతమంది అధికారులే తప్పుదారి పట్టించి ఎస్ఐపై తీవ్రమైన చర్యల్లేకుండా పావులు కదలిపారని పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది.

మునిసిపల్ కార్మికుడి ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చిన్న

మధురవాడ, జనవరి 4: సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికుడు ఆత్మహత్యకు యత్నించడం నగరంలో కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ పరిధిలోని పీఎం పాలెం కారుషెడ్ కూడలి వద్ద గురువారం కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అదే ప్రాంతంలో జడ్సీ, ఆరోగ్య శాఖాధికారులు ప్రైవేటు వ్యక్తులతో చెత్త తరలించే పనులు చేపట్టారు. అది చూసి తమ సమ్మెను నిర్వీర్యం చెయ్యడానికి అధికారులు యత్నిస్తున్నారంటూ యాజ్జల చిన్న అనే కార్మికుడు తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ను శరీరంపై పోసుకున్నాడు. నిప్పంటించుకోబోయాడు. ఈలోగా తోటి కార్మికులు చూసి అడ్డుకుని, నీళ్లు పోశారు. ఈ గందరగోళంలో చిన్నా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో అతడిని సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించారు. సీఐటీయూ నాయకులు డి.అప్పలరాజు, కిరణ్, శేషుబాబు, రాంబాబు తదితరులు ఆస్పత్రికి చేరుకొని చిన్నా ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతిమ విజయం కార్మికులదేనని అప్పటివరకూ ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మె విషయంలో మొండిపట్టు వీడి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఒకే కుటుంబం ఒకే మాట రెండుగా చీలిపోయాయి

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జనవరి 4: మీరు జైల్లో ఉన్న సమయంలో మీ విజయానికి అహర్నిశలూ శ్రమించిన మీ తల్లి, చెల్లి కష్టాన్ని వాడుకుని సీఎం అయ్యాక వారిని తరిమేసిన మాట నిజం కాదా అన్ని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్ వేదికగా సీఎం జగన్ను ప్రశ్నించారు. మా కుటుంబంలో చిచ్చుపెడుతున్నారంటూ ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. జగనన్న వదిలి బాణాన్ని అని రాష్ట్రమంతా తిరిగిన చెల్లికి అన్యాయం చేయమని ఏపార్టీ చెప్పిందన్నారు. ఆస్తి పంపకాల్లో అన్యాయం చేయమని, ఎంపీ టికెట్ ఇవ్వొద్దని ఏ నాయకుడు చెప్పాడని ప్రశ్నించారు. తండ్రిని హత్యచేసిన వారిని శిక్షించాలని ఢిల్లీలో కాళ్లు అరిగేలా తిరుగుతున్న మరో చెల్లికి న్యాయం చేయవద్దని ఎవరు చెప్పారో అందరికీ తెలుసన్నారు. తల్లిదండ్రులను, కుటుంబాన్ని గౌరవించలేని వారు సమాజాన్ని గౌరవించలేరని మీ ద్వారా నిరూపితమయిందన్నారు. మీరు పెట్టిన చిచ్చే రానున్న ఎన్నికల్లో మిమ్మల్ని చుట్టుముడుతుందనే విషయం గమనించాలని సూచించారు.



హెచ్‌వోడీకి అభినందనలు తెలుపుతున్న నాయకులు

ఉక్కు వర్క్స్ హెచ్‌వోడీకి నాన్ జేసీఎం కార్మిక నాయకుల అభినందనలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 4: స్టీల్‌ప్లాంట్ వర్క్స్ విభాగం హెచ్‌వోడీగా బాధ్యతలు స్వీకరించిన అజయ్‌కుమార్ సోప్తిని నాన్ జేసీఎం కార్మిక సంఘ నాయకులు గురువారం కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనతో కార్మిక నాయకులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలని, భద్రతకు పెద్దపీట వేయాలని, కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. దీనిపై వర్క్స్ విభాగాధిపతి సానుకూలంగా స్పందించారని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వై.మస్తానప్ప, వరసాల శ్రీనివాసరావు, డీఈ రమణారెడ్డి, డి.అప్పారావు, ఎస్.సింహాద్రి, అప్పలరాజు, కె.సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, అనాథలకు దుప్పట్లు పంపిణీ



వృద్ధురాలికి దుప్పటి అందించిన 'హెల్పింగ్' సభ్యులు

పెందుర్తి, జనవరి 4: సమాజ సేవే ధ్యేయంగా పరిచేస్తున్న సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు గురువారం రాత్రి చలితో అల్లాడుతున్న పలువురు వృద్ధులు, అనాథలు, యాచకులకు దుప్పట్లను అందజేశారు. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్, వేపగుంట, గోపాలపట్నం ప్రాంతాల్లో ఫుట్‌పాత్, రోడ్ ఓవర్ బ్రిడ్జిలపై నిద్రిస్తున్న సుమారు వందమందికి దుప్పట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు దాడి శ్రీనివాసరావు, సభ్యులు సిరిమల్ల గణేశ్, శ్రీరామ్, పి.భాను, కృష్ణ, హేమంత్‌కుమార్, మణి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'సృష్టి'లో సైన్స్ ఎగ్జిబిషన్

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 4: స్టీల్‌ప్లాంట్ సృష్టి వరల్డ్ స్కూల్‌లో ఈ నెల ఆరు, ఏడు తేదీల్లో సైన్స్ అండ్ ఆర్ట్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్టు పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేఘన తెలిపారు. స్కూల్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతిసృష్టి పేరుతో అద్భుతమైన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, విమ్సీ వండర్‌ల్యాండ్, టెక్ ఒడెస్సీ, ఫ్లేటోపియా, ఫుడ్‌థాన్, ఎంట్రప్రెన్యూరియల్ ఫోకస్, చంద్రయాన్, స్టీమ్ పవర్ ప్లాంట్, శారీరక దివ్యాంగుల కోసం వీల్‌చైర్, ఘాట్ రోడ్డులో ప్రమాదాల తదితర నమూనా ప్రాజెక్టులను ప్రదర్శిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సుశీలరాణి, ప్రిన్సిపాళ్లు చంద్రిక, శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

సింధియా, జనవరి 4: జీవీఎంసీ 63వ వార్డుకు చెందిన దుర్గాభవానీ అనే మహిళ మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ ఆధ్వర్యంలో రూ.20 వేల ఆర్థిక సహాయాన్ని నియోజకవర్గ సమన్వయకర్త అంగ దుర్గాప్రశాంతి గురువారం అందజేశారు. నాయకులు జి.శివ, గంగాధర్, శ్యాంసుధాకర్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలివే..

పెందుర్తి, జనవరి 4: పెందుర్తి సబ్ స్టేషన్ పరిధిలోని ఫీడర్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్న కారణంగా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్టు ఈఈ పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా సాయినిరంజన్ కాలనీ, బృందావన్ కాలనీ, శేఖర్‌లేఅవుట్, అఖిలేశ్వరి ఆస్పత్రి ఏరియా, దొగ్గవానిపాలెం, ప్రసాద్‌నగర్, రైల్వేస్టేషన్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సినిమా గైడ్

- **డెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లలిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **పిండం :** మోహిని (గాజువాక)
- **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 24, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు)28, బెండకాయలు 54, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 52, బీరకాయలు 50, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 24, క్యాబేజీ 20, క్యారెట్ 46, దొండకాయలు 36, బంగాళదుంపలు 18, అరటికాయ (పెద్దది) 7, అల్లం (పాతది) 100, మునక్కాడలు (కిలో) 80, బరబాటి 50, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 44, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 220, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 36 , ఆగాకర 84, పొటల్స్ 56, కీర దోస 24, క్యాప్సికం 76, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 50, చిలగడదుంపలు 24, కంద 50, దేముడుచిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాల కూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్రాయిగ్

రైతు ధర	--	75
ఫారం ధర	--	95
విత్ స్కిన్	--	160
స్కిన్‌లెస్	--	170

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..



చెత్తాచెదారంతో నిండిన గాజువాక వుడా కాలనీ ప్రధాన రహదారి



గాజువాక రాజీవ్ మార్గ్ రహదారిపై పారుతున్న మురుగు నీరు

క్షీణిస్తున్న పారిశుధ్యం

కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమ్మెతో వీధుల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలు

కాలువలు పూడికపోవడంతో రహదారులపై పారుతున్న మురుగు నీరు

తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

గాజువాక, జనవరి 4: జీవీఎంసీ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల సమ్మె కొనసాగుతుండడంతో వీధుల్లో పారిశుధ్యం పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తున్నది. పారిశుధ్య కార్మికుల సమ్మె ప్రభావంతో వీధుల్లో, రహదారులపై ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోతోంది. పలుచోట్ల కాలువలు వ్యర్థాలతో నిండిపోవడంతో మురుగు నీరు రహదారులపై పారుతోంది. చెత్తకుప్పలు తిష్ట వేయడంతో పాటు రోడ్లపై మురుగు నీరు పారుతుండడంతో భరించరాని దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య పరిస్థితి అస్తవ్యస్తంగా మారడంతో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పారిశుధ్య కార్మికులకు మద్దతుగా తాగునీటి సరఫరా విభాగం సిబ్బంది కూడా విధులు బహిష్కరించి ఆందోళనకు దిగడంతో గత రెండు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు నానాపాట్లు పడుతున్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినా..

కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు సమ్మెబాట పట్టడంతో వివిధ సంస్థల నుంచి సుమారు 350 మంది కార్మికులతో జీవీఎంసీ అధికారులు పారిశుధ్య పనులు చేపడుతున్నా పరిస్థితి పెద్దగా మెరుగుపడలేదు. వారు కీలకమైన ప్రధాన రహదారులు, మెయిన్ రోడ్లు, వార్డుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తరలిస్తున్నారు. దీంతో మిగతా ప్రాంతాల్లో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి.

రహదారులపైకి చెత్తాచెదారం

పెదగంట్యాడ: కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తుండడంతో ఎక్కడికక్కడే వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇళ్ల నుంచి చెత్త సేకరణ నిలిచిపోవడంతో ప్రజలంతా వ్యర్థ పదార్థాలను రోడ్డు పక్కన పడేస్తున్నారు. దీంతో అన్ని ప్రధాన రోడ్ల పక్కన చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. 65వ వార్డు పరిధిలోని కొత్త దిబ్బపాలెం, అశోక్‌నగర్, గిరిజాకాలనీ, ప్రియదర్శినీకాలనీ, వాంబే కాలనీ, భానోజీతోట, తదితర ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితే నెలకొంది. చెత్తను పశువులు చెల్లాచెదురు చేస్తుండడంతో వ్యర్థాలన్నీ రహదారులపైకి వచ్చేస్తున్నాయి. దీంతో ఆయా మార్గాలు దుర్గంధంగా మారడంతో పాటు రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

కంపు కొడుతున్న వీధులు

వేపగుంట: పారిశుధ్య కార్మికుల సమ్మెలో వీధుల్లో చెత్తాచెదారం పేరుకుపోయి భరించరాని దుర్గంధంతో ప్రజలు సతమతమవుతున్నారు. ప్రధాన రోడ్లలోని చెత్తను పోలీసుల సహకారంతో అధికారులు సిబ్బందితో తరలిస్తున్నా.. వీధులు, కాలనీల్లో వ్యర్థాలను తొలగించకపోవడంతో ఆయా కాలనీలు, వీధులు కంపు కొడుతున్నాయి. ముఖ్యంగా అప్పన్నపాలెంలోని వీధులు, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ పరిసరాలు, పంచాయతీకాలనీ వీధి శివార్లలో ఎద్దఎత్తున చెత్త పేరుకుపోయింది. రోజుల తరబడి వ్యర్థాలు పేరుకుపోవడంతో వీధులన్నీ కంపు కొడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. అందువల్ల ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



65వ వార్డు గిరిజాకాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట పేరుకుపోయిన వ్యర్థాలు



అప్పన్నపాలెం జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో చెత్తాచెదారం

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

దీక్షా శిబిరంలో సొమ్మసిల్లి పడిపయిన ఇద్దరు ఆయాలు

ఫిట్స్ కారణంగా ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కేజీహెచ్‌కు తరలింపు

ఎన్ని కష్టాలు ఎదురైనా తగ్గేదే లేదంటున్న నాయకులు



సొమ్మసిల్లి పడిపోయిన ఆయాలు తులసి, వెంకటలక్ష్మిలను సీహెచ్‌సీకి తీసుకువచ్చిన అంగన్‌వాడీలు

పెందుర్తి, జనవరి 4: న్యాయ సమ్మతమైన తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో వారు తమ నిరసనను తెలియజేస్తున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన శిబిరం వద్దకు గురువారం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నినాదాలు చేస్తున్న ఇద్దరు ఆయాలు సొమ్మసిల్లి పడిపోయారు. ఇందులో సరిపల్లి గ్రామానికి చెందిన ఆయా తులసికి ఫిట్స్ వచ్చి కొట్టుకోవడంతో ఆమె చేతితో తాళాల గుత్తిని పెట్టి వెంటనే ఆటోలో పెందుర్తి సీహెచ్‌సీకి తరలించారు. అలాగే పెందుర్తి ప్రాంతానికి చెందిన వెంకటలక్ష్మి సొమ్మసిల్లి పడిపోవడంతో ఆమెకు అంగన్‌వాడీలు సపర్యలు చేసి వైద్య సహాయం నిమిత్తం సీహెచ్‌సీలో చేర్పించారు. అయితే ఫిట్స్‌తో బాధపడుతున్న తులసి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. వెంకటలక్ష్మికి వైద్యం అందించడంతో ఆమె కోలుకున్నది. ఈ నెల ఐదో తేదీల్లో సమ్మె విరమించి విధుల్లో చేరకపోతే తగిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం అల్టిమేటం విధించడంతో తాము తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నామని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుల తరబడి ఆందోళనలు చేస్తుండడంతో నీరసించిపోయి అనారోగ్యానికి గురవుతున్నామని వాపోతున్నారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని కన్నీటి పర్యంతమవుతున్నారు. వైసీపీ ప్రభుత్వ నిరంకుశత్వం వల్ల అంగన్‌వాడీలు మానసిక క్షోభకు గురవుతున్నారని, ఇందుకు నిదర్శనం నిరసన శిబిరంలో ఇద్దరు ఆయాలు సొమ్మసిల్లి పడిపోవడమేనని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా ప్రభుత్వ మెడలు వంచి న్యాయమైన డిమాండ్లను సాధించి తీరుతామని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.దేవి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.అనిత, అధ్యక్షురాలు బృంద, తదితరులు పాల్గొన్నారు.

థియేటర్ లాకర్ నుంచి రూ.20 లక్షలు అపహరణ

గాజువాక, జనవరి 4: గాజువాక మోహిని థియేటర్ లాకర్‌లో ఉంచిన రూ.20 లక్షలు అపహరణకు గురైనట్టు గాజువాక క్రైమ్ పోలీసులకు థియేటర్ యాజమాన్యం ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. మోహిని థియేటర్ యజమాని వంశీకిశోర్ బుధవారం మేనేజర్ అలీకి రూ.20 లక్షలు అందజేసి గుంటూరు కారం సినిమా డిస్ట్రిబ్యూటర్‌కు ఇవ్వాలని సూచించారు. దీంతో మేనేజర్ ఆ నగదును గురువారం ఉదయం ఇద్దామని థియేటర్ లాకర్‌లో ఉంచారు. అయితే గురువారం ఉదయం చూసేసరికి లాకర్ విరగ్గొటి ఉందని, అందులో ఉంచిన రూ.20 లక్షలు కనిపించడం లేదని యజమానికి తెలిపారు. ఈ మేరకు వంశీకిశోర్ గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

యువకుడు అదృశ్యం



పృథ్వీరాజ్ (ఫైల్)

గాజువాక, జనవరి 4: గాజువాక ప్రాంతానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమైనట్టు పోలీసులు తెలిపారు. ఇక్కడి వుడా కాలనీకి చెందిన కింతాడ పృథ్వీరాజ్ గతనెల 27న ఇంటి నుంచి కారులో బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఇప్పటివరకు పృథ్వీరాజ్ ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆయన బావ నాగులకొండ సూర్యనారాయణ గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు, స్నేహితుల ఇళ్ల వద్ద ఆరా తీసినా పృథ్వీరాజ్ గురించి ఎలాంటి సమాచారం లేదని, ఫోన్లు కూడా స్విచ్ఛాఫ్ వస్తున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీసీ సామాజిక చైతన్య సభ పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక, జనవరి 4: నగరంలోని ఏఎస్ రాజా కళాశాల మైదానంలో ఈ నెల ఏడో తేదీన రాష్ట్ర బీసీ సామాజిక చైతన్యసభ జరగనున్నదని, ఈ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయవలసిందిగా బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కోరారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో ఈ సభకు సంబంధించిన పోస్టరును గురువారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల నాగేంద్రయాదవ్, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి కిలపర్తి సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్, ప్రతినిధులు యల్లాజీరావు, సోంబాబు, గౌరీశంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

గంగవరం పోర్టు కార్మికుల నిరసన ప్రదర్శన

పెదగంట్యాడ, జనవరి 4: అదానీ గంగవరం పోర్టు కార్మికులకు యాజమాన్యం చెల్లించాల్సిన 44 రోజుల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు గురువారం పెదగంట్యాడ మహాత్మాగాంధీ జంక్షన్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. తమ డిమాండ్ల సాధన కోసం గంగవరం పోర్టు కార్మికులు గతంలో 44 రోజుల పాటు ఆందోళనలు చేసిన సంగతి తెలిసిందే. ఆ రోజులకు సంబంధించిన వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.తాతారావు మాట్లాడుతూ బకాయి వేతనాలకోసం పోర్టు యాజమాన్యం, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం బకాయి వేతనాలు చెల్లించకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు, స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, నాయకులు వాసుపల్లి ఎల్లయ్య, కదిరి సత్యారావు, సత్యానందం, కణితి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం

కూర్మన్నపాలెం, జనవరి 4: జీవీఎంసీ 88వ వార్డు పరిధి దువ్వాడ సెక్టార్-1లో గురువారం రాత్రి జనసేన కార్యాలయాన్ని ఆ పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో యువత నిర్వీర్యమైందన్నారు. రానున్న ఎన్నికల్లో యువత ముఖ్య భూమికను పోషించాలని, టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులను అత్యధిక ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కరణం కనకారావు, పి.శ్రీకాంత్, కాద శ్రీను, బలిరెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడారి తులసీరావుకు నివాళి



నివాళులర్పిస్తున్న డైరెక్టర్లు, కార్మికులు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 4: ఉత్తరాంధ్రలో రైతు సంక్షేమంతో పాటు పాడి పరిశ్రమ అభివృద్ధికి విశేష కృషి చేసిన ఘనత విశాఖ డెయిరీ మాజీ చైర్మన్ దివంగత ఆడారి తులసీరావుకే దక్కుతుందని ఎలమంచిలి మునిసిపల్ చైర్‌పర్సన్ పి.రమాకుమారి అన్నారు. గురువారం డెయిరీలో నిర్వహించిన తులసీరావు ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా తులసీరావు కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెయిరీ బోర్డు డైరెక్టర్లు కాటమయ్య, సూర్యనారాయణ, రమణబాబు, రామకృష్ణ, అధికారులు విజయారావు, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్‌తో లియో గ్లోబల్ ఓవర్సీస్ సంస్థ ఎంవోయూ

అగనంపూడి, జనవరి 4: దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలతో లియో గ్లోబల్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ సంస్థ ఎంవోయూ కుదుర్చుకున్నది. ఈ మేరకు గురువారం సంస్థ అడ్మినిస్ట్రేషన్ మేనేజర్ కోన వాసవి, విజ్ఞాన్ రెక్టార్ వి.మధుసూదనరావు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా రెక్టార్ మాట్లాడుతూ 'లియో' సంస్థతో ఎంవోయూ కారణంగా విద్యార్థులకు అంతర్జాతీయ యాక్సెస్, పరిశోధన అవకాశాలతో పాటు అనేక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఆపరేషన్ మేనేజర్ కె.రాజేంద్ర, ప్రిన్సిపాల్ జె.సుధాకర్, ఉపాధి అవకాశాల అధికారి బి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటర్లుగా నమోదు కావాలి: ఆర్డీవో

మల్కాపురం, జనవరి 4: అర్హులందరూ తప్పనిసరిగా ఓటర్లుగా నమోదు కావాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో గురువారం నిర్వహించిన స్వీప్ అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ యువత ఓటు హక్కు విలువ తెలుసుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నారు. ములగాడ తహసీల్దార్ దొడ్డి వీరభద్రరావు మాట్లాడుతూ ఓటు వినియోగంపై యువత విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి, సీనియర్ ప్రోగ్రామ్ అధికారి అనసూయాదేవి, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు ప్రైవేటీకరణపై కేంద్రానికి సహకరిస్తున్న జగన్'

కూర్మన్నపాలెం, జనవరి 4: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణలో కేంద్రానికి సీఎం జగన్ సహకరిస్తున్నారని, అందువల్ల ఉక్కు కార్మికుల ఆగ్రహ జ్వాలల్లో వైసీపీ పతనం కావడం తథ్యమని తెలుగుశక్తి అధ్యక్షుడు బీవీ రామ్ అన్నారు. కూర్మన్నపాలెంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు గురువారం ఆయన హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కోడిపై, వాటి గుడ్లపై పరిశోధనలు చేస్తున్నారే తప్ప యువతకు పనికొచ్చే ఒక పనైనా చేయకపోవడం వల్లే ఆయనకు సీటు ఇవ్వకుండా పక్కన పెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ నీరుకొండ రామచంద్రరావు, ఎస్.రామారావు, రామస్వామి, పరంధామయ్య, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అమర్‌నాథ్ ఇంటికి వైవీ సుబ్బారెడ్డి

అక్కిరెడ్డిపాలెం, జనవరి 4: మిందిలోని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఇంటికి గురువారం వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డికి దుశ్శాలువా కప్పి మంత్రి సత్కరించారు. కార్యక్రమంలో వైసీపీ గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి ఉరుకూటి చందు, నాయకులు గుడివాడ లతీశ్, సంద్రాన నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం

నారా భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలి

తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

గాజువాక, జనవరి 4: వ్యవస్థలను అడ్డం పెట్టుకుని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడును అక్రమంగా 53 రోజుల పాటు జైలులో ఉంచిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన గాజువాక నియోజకవర్గానికి చెందిన మూడు కుటుంబాలను చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి శుక్రవారం పరామర్శించనున్నారన్నారు. 'నిజం గెలవాలి' పేరిట జరగనున్న ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు ప్రసాదుల శ్రీనివాస్, నల్లూరు సూర్యనారాయణ, జి.వాసు, రట్టి వాసు, బైపిల్లి గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

79వ వార్డులో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ

అగనంపూడి: వైసీపీ ప్రభుత్వ పాలనలో అప్పులే తప్ప అభివృద్ధి జరగలేదని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ విమర్శించారు. 79వ వార్డు పరిధి బీసీ కాలనీలో గురువారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఆయన టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయకులు దాముర్రేతి అర్జున్, పెంటబాబు, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ సెక్టార్-1లో..

కూర్మన్నపాలెం: రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక, అసమర్థ ప్రభుత్వ పాలన అంతమే లక్ష్యంగా టీడీపీ-జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని 'దేశం' 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. గురువారం దువ్వాడ సెక్టార్-1లో నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాయకులు వేగుంట శ్రీనివాస్, అప్పారావు, కె.శ్రీను, గోవింద్, తేజ, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట బీసీ కాలనీల్లో..

వేపగుంట: జీవీఎంసీ 94వ వార్డు వేపగుంట బీసీ కాలనీల్లోని 170, 183, 184 బూత్‌ల పరిధిలో టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు మామిడి కిరణ్, వేణు, జగదీశ్, ప్రసాద్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

59వ వార్డులో..

మల్కాపురం: చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని 'పశ్చిమ' ఎమ్మెల్యే పి.గణబాబు తనయుడు మౌర్యసింహ అన్నారు. 59వ వార్డు హనుమాన్‌నగర్‌లో నిర్వహించిన 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ'లో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, జనవరి 4: నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు.సాయిబాబాఆలయం, ఎస్ఎఫ్ఎస్ స్కూల్, ఎన్ఆర్ఐ ఆస్పత్రి రోడ్డు, కృష్ణ మందిర్ రోడ్డు, కెనరా బ్యాంక్, ఆర్కేనగర్, వసంత విహార్, ప్రెసిడెన్షియల్ స్కూల్, వెలమ భవన్, బీఎస్ లే అవుట్ ఏరియాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

చెత్త కుప్పలను తొలగించండి

జ్ఞానాపురం, జనవరి 4: పారిశుధ్య కార్మికుల సమ్మెతో పదిరోజులుగా పేరుకుపోయిన చెత్త కుప్పలను తక్షణమే డంపింగ్ యార్డులకు తరలించాలని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి కృష్ణ శానిటరీ ఇన్స్పెక్టర్లను ఆదేశించారు. జ్ఞానాపురం, రైల్వేస్టేషన్, కంచరపాలెం ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించి, పారిశుధ్య పరిస్థితిని పరిశీలించారు. అవసరమైన చోట రోజు వారి కూలి పద్ధతిలో కార్మికులను నియమించుకుని పనులు జరిగేలా చూసుకోవాలన్నారు.


పుష్పాలంకరణలో కన్యకాపరమేశ్వరి


ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

కన్యకాపరమేశ్వరి అమ్మవారికి విశేష పూజలు

మహారాణిపేట, జనవరి 4: వన్‌టౌన్‌లోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మార్గశిర గురువారం సందర్భంగా విశేష పూజలు జరిగాయి. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం 108 బంగారు పుష్పాలతో పూజించారు. తెల్లవారుజాము నుంచీ జరిగిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం సూమారు 300 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్రనామ పారాయణం చేశారు. అన్న ప్రసాదాలను అందించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధ్య టక్ష, కార్యదర్శులు ఆరిశెట్టి దినకర్ గ్రంధి రామకృష్ణారావు, సుగుణ శివకుమార్ ఏర్పాట్లు చేశారు.

మహిళా సాధికారతే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

›› మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు


కళాశాలలో మొక్కలు నాటుతున్న హరిబాబు

డాబాగార్డెన్స్, జనవరి 4: మహిళా సాధికారతే ప్రధాని మోదీ లక్ష్యమని మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాల నూతన విద్యార్థుల వేడుకలకు గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కళాశాల వ్యవస్థాపకులు శృంగవరపు సూర్యారావు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజల్వన అనంతరం సరస్వతీదేవి విగ్రహానికి పూలమాల వేసి కళాశాల ఆవరణలో పూలమొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో 65 శాతం యువత ఉన్నారన్నారు. జాతీయ విద్యావిధానం రూపొందించిన ప్రధాని మహిళల్లోని నైపుణ్యాన్ని వెలికితీసి, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా శిక్షణ అందించేలా చర్యలు తీసుకున్నారన్నారు. అనంతరం మెరిట్ విద్యార్థులకు గవర్నర్ పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.శోభారాణి అధ్యక్షత వహించగా వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, అరుణపద్మ, గీతాంజలి, అనురాధ, ధరణి, శర్మ, కల్యాణిరామ్, రాజు, రూపాకుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను నమ్మి మోసపోయిన మంత్రి అమర్‌నాథ్

›› జనసేన పార్టీ కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న మూర్తియాదవ్

సీతమ్మధార, జనవరి 4: గొర్రె కసాయిని నమ్మినట్టు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జగన్‌ను నమ్మి దారుణంగా మోసపోయారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అన్నారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రకాలుగా నాశనం చేసిన జగన్, చివరికి నమ్మకంగా ఉండి నోటికి ఏది వస్తే అది మాట్లాడే అమర్‌నాథ్ లాంటి వారిని కూడా మోసం చేశారన్నారు. లారీలకు కప్పం వసూలు చేయడం, ఫార్మా కంపెనీలతో బొగ్గు వ్యాపారం చేయడం, అయినకాడికి భూములను దోచేయడం లాంటి వ్యవహారాలు నడిపిన అమర్‌నాథ్‌కు తగిన శాస్తి జరిగిందన్నారు. ప్రతిరోజూ పవన్ కల్యాణ్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్న అమర్‌నాథ్ గురువారం అనకాపల్లిలో కన్నీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితికి వచ్చారని ఎద్దేవా చేశారు. విస్సన్నపేటలో 609 ఎకరాల అక్రమ లే అవుట్‌తో రూ.వేల కోట్ల భూ కుంభకోణానికి తెరలేపారన్నారు. ఆర్ఈసీఎస్ పేరిట సుమారు రూ.200 కోట్ల అవినీతికి పాల్పడ్డారన్నారు. అమాయకులైన 35 మందిని ఉద్యోగాల పేరుతో మోసం చేశారన్నారు. అనకాపల్లిలో క్వారీలు, క్రషర్ల నుంచి దోచేశారన్నారు. ఎన్నో అక్రమాలకు పాల్పడిన అమర్‌నాథ్‌కు తగిన గుణపాఠం దక్కిందన్నారు.

నారా భువనేశ్వరి పర్యటన ఏర్పాట్లు పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా

అక్కయ్యపాలెం, జనవరి 4: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు జైలులో ఉన్న సమయంలో తీవ్ర దిగ్భ్రాంతి, ఆందోళనకు గురై మృతిచెందిన 45వ వార్డు తాటిచెట్లపాలెం ప్రాంతానికి చెందిన మంచిరెడ్డి కనకారావు కుటుంబసభ్యులను చంద్రబాబు సతీమణి భువనేశ్వరి శుక్రవారం పరామర్శిస్తారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం నాయకులతో కలిసి మృతుని ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించి నిజం గెలవాలి యాత్రలో భాగంగా భువనేశ్వరి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంటన నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్‌బాబు, నేతలు భరణికాన రాజు, నరేంద్ర, షేక్ బాబ్జీ, వాసుపల్లి రాజు, గొలగాని సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మేయర్

కంచరపాలెం, జనవరి 4: పలు అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరివెంకటకుమారి గురువారం శంకుస్థాపన చేశారు. జీవీఎంసీ 55వ వార్డు జామువానగర్, రెడ్డికంచరపాలెంలో బీటీ రోడ్లు, కాలువలు, డ్రైన్లు నిర్మాణానికి జీవీఎంసీ రూ.1.48 కోట్లు కేటాయించింది. పనులను గురువారం ఉత్తర వైసీపీ ఇన్‌చార్జి కేకేరాజుతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, కార్పొరేటర్ కేవీఎన్ శశికళ, డీఈ భరణి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షునికి సత్కారం


శ్రీనివాసరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, జనవరి 4: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) జిల్లా గౌరవాధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన ఎన్‌జీజీఓస్ కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఆర్.శ్రీనివాసరావును ఉపాధ్యాయులు గురువారం సత్కరించారు. హెచ్ఎం బి.లక్ష్మీనరస మాట్లాడుతూ శ్రీనివాసరావు గతంలో విశాఖ అర్బన్ అధ్యక్షునిగా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిశోర్, ఎంవీ ధర్మారావు, మాణిక్యం, ఎ.సునంద్, ఎంఈవో విశ్వనాథ్, జ్యోతి, లలిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి 55వ వార్డు అధ్యక్షుడు రాజీనామా

కంచరపాలెం, జనవరి 4: గ్రేటర్ 55వ వార్డు వైసీపీ అధ్యక్షుడు యర్రంశెట్టి శ్రీనివాసరావు తన పదవికి, పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి గురువారం రాజీనామా చేశారు. పదవులు, నామినేటెడ్ పోస్టు గానీ ఇవ్వకపోవడంతో మనస్తాపంతో పార్టీని వీడుతున్నానన్నారు. అభిమానుల అభిప్రాయం మేరకు భవిష్యత్తు నిర్ణయం తీసుకుంటానన్నారు.

బైజూస్‌పై దాడి కేసులో ఐదుగురి అరెస్టు

సీతంపేట, జనవరి 4: ద్వారకానగర్‌లోని బైజుస్ సెంటర్‌పై దాడి కేసులో పోలీసులు ఐదుగురిని అరెస్టు చేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ ఎరిపల్లి రాంబాబు, అధ్యక్షుడు కెంగువ అచ్యుతరావు, కార్యదర్శి ఉల్లం నాగరాజు, ఎరిపల్లి సాయిబాబు, గుర్రాల ఎర్రయ్యలను ఇన్‌చార్జి సీఐ సోమశేఖర్ అరెస్టు చేశారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

సీతంపేట, జనవరి 4: రైల్వే న్యూకాలనీ రామాలయం వీధిలో ఉంటున్న పి.ఖాలీల్ ఖాన్ (67) బుధవారం నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు అందింది. పాల ప్యాకెట్ విషయమై జరిగిన గొడవతో వెళ్లిపోయిన తన భర్త తిరిగి రాలేదని అతడి భార్య భార్య నజీర్ బేగం ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వెంకటరావు కేసు నమోదు చేశారు.

మంత్రి అమర్‌నాథ్ కంటతడి

›› అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్ పరిచయ కార్యక్రమంలో భావోద్వేగం


సమావేశంలో కంటతడి పెట్టిన మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లి టౌన్, జనవరి 4: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భావోద్వేగానికి లోనయ్యారు. కంటతడి పెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే... ప్రస్తుతం ఆయన అనకాపల్లి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే రెండు రోజుల క్రితం వైసీపీ అధిష్ఠానం నియోజకవర్గ సమన్వయకర్తగా మలసాల భరత్‌కుమార్‌ను నియమించింది. అమర్‌నాథ్‌కు ఏ నియోజకవర్గం కేటాయించలేదు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి అనకాపల్లిలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాలులో జరిగిన భరత్ పరిచయ కార్యక్రమంలో మంత్రి ఉద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. అనకాపల్లి ప్రజలు తనపై చూపిన అభిమానాన్ని, ఆప్యాయతను మరిచిపోలేక బాధను దిగమింగుకుంటున్నానన్నారు. తల్లిదండ్రులు తనకు జన్మనిస్తే, అనకాపల్లి ప్రజలు రాజకీయ పునర్జన్మను ఇచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ సమన్వయకర్తగా నియమితులైన మలసాల భరత్‌కుమార్‌ను ఆదరించాలని మంత్రి కోరారు. తనకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏ బాధ్యత అప్పగిస్తే దానిని నిర్వహిస్తానన్నారు. ఆయన ఆదేశాల మేరకు తాను పనిచేయాల్సి ఉంటుందన్నారు. కాగా, అమర్‌నాథ్ ఎలమంచిలి, చోడవరం, గాజువాక, పెందుర్తి నియోజకవర్గాల్లో ఏదో ఒకచోట నుంచి పోటీ చేయాలని అమర్‌నాథ్ భావిస్తున్నారు. ఆయన ప్రయత్నాలు ఎంతవరకూ ఫలిస్తాయో చూడాలి. ఆయన్ను అనకాపల్లి లోక్‌సభ స్థానానికి పోటీ చేయించే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

అంగన్‌వాడీలపై పోలీసు చర్యలు దారుణం

›› ధ్వజమెత్తిన సీఐటీయూ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సిటూ నేతలు

జగదాంబ కూడలి, జనవరి 4: న్యాయమైన కోర్కెల సాధనకు సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై పోలీసులు దాష్టీకం ప్రదర్శించడం హేయమైన చర్యని సీఐటీయూ నాయకులు ధ్వజమెత్తారు. ఈ మేరకు సిటూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ రవికుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ సిబ్బంది గత 24 రోజులుగా సమస్యల పరిష్కారం కోసం ఆందోళనలు చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పైగా పోలీసులతో నిర్బంధించాలని చూడడం పిరికిపంద చర్యగా అభివరించారు. చలో కలెక్టరేట్‌కు పెద్దఎత్తున అంగన్‌వాడీలు తరలిరావడంతో వారిపై పోలీసులు దారుణంగా దాడిచేయడంపై ఆయన విరుచుకుపడ్డారు. పోలీసు నిర్బంధాలతో ఉద్యమాలను అడ్డుకోవడం అన్యాయమని హెచ్చరించారు. అంగన్‌వాడీలను మగ పోలీసులతో నిర్బంధించడం దారుణమన్నారు. మునిసిపల్ కార్మికులు, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల నిరసనలను అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందని, దీనికి తగిన ఫలితాన్ని అనుభవిస్తుందన్నారు. ఈ చర్యలను సిటూ తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. సమావేశంలో వై.తులసి, జి.అప్పలరాజు, ఎం.సుబ్బారావు, పి.మణి ఆర్.శోభారాణి పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖలో అడ్డగోలు పదోన్నతులు

›› రోస్టర్ పాయింట్స్‌లో అక్రమాలపై ఆర్డీకి పలువురి ఫిర్యాదు

విశాఖపట్నం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో పలువురు ఉద్యోగులకు పదోన్నతులు కల్పించే విషయంలో అధికారులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టాఫ్ నర్సు నుంచి హెడ్‌నర్సుగా ఐదుగురికి పదోన్నతులు కల్పించేందుకు ఎస్ఆర్‌లను పిలిచారు. వారిలో ఒకామెకు అడ్డగోలుగా పదోన్నతి కల్పించేందుకు రోస్టర్ పాయింట్స్ మార్చారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు పలువురు ఆర్డీని కలిసి వినతిపత్రం సమర్పించారు. నిబంధనలకు విరుద్ధంగా రోస్టర్ పాయింట్స్ రూపొందించి అనర్హురాలికి పదోన్నతి కల్పించేందుకు సీనియర్ అసిస్టెంట్‌తో పాటు మరో ఉన్నతాధికారి ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై విచారణ చేయాలని కోరుతున్నారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

చిన్నారులు భవిష్యత్తు ఫుట్‌బాలర్లగా ఎదగాలి

›› అకాడమీ ప్రారంభోత్సవంలో డాక్టర్ ఆదినారాయణ


ప్రారంభోత్సవంలో చిన్నారులతో నిర్వాహకులు

విశాఖపట్నం (స్పోర్ట్సు), జనవరి 4: చిన్నారి ఫుట్‌బాలర్ల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపై ఉందని పద్మశ్రీ డాక్టర్ ఎస్‌వీ.ఆదినారాయణ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాజీ ఫుట్‌బాలర్ పి.కొండలరావు జయంతి సందర్భంగా స్టార్ ఫెక్స్ ఫుట్‌బాల్ క్లబ్ జీవీఎంసీ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో గురువారం అకాడమీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఘన చరిత్ర కలిగిన విశాఖ ఫుట్‌బాల్ క్రీడారంగం కొద్దికాలంగా మసక బారిందని, చిన్నారి క్రీడాకారుల ద్వారా పూర్వ వైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన చివరి ఫుట్‌బాలర్‌గా కొండలరావు గుర్తింపు పొందారన్నారు. కోచ్‌గా 150 మందిని తీర్చిదిద్దిన ఆయన అకాల మరణం బాధాకరమన్నారు. ఆయన స్ఫూర్తితో ఫుట్‌బాల్ అకాడమీని ప్రారంభించిన స్టార్ ఫెక్స్ క్లబ్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో అకాడమీ కోచ్ శేషుమోహన్, నిర్వాహకులు త్రినాథరావు (బాబు), సన్నీ, పాల్గొన్నారు.


జయహో బీసీ పేరిట తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో జరిగిన సదస్సులో మట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి

వైసీపీలో ధిక్కార స్వరం

... 5వ పేజీ తరువాయి

వైవీ సుబ్బారెడ్డి అక్కడ నుంచి నిష్క్రమించారు. అయితే అధిష్ఠానం నిర్ణయాలను నగరంలో పలువురు నాయకులు బహిరంగంగానే వ్యతిరేకిస్తున్నా కనీసం షోకాజ్ నోటీసు ఇవ్వకపోవడం పార్టీ నేతలతోపాటు కార్యకర్తలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. గతంలో సమన్వయకర్త ఆదేశాన్ని పాటించలేదని ఒక కార్పొరేటర్‌ను సస్పెండ్ చేశారు. ఇప్పుడు పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త ఎదుట ధిక్కార స్వరం వినిపించినా కనీస చర్యలు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే కీలక పదవుల్లో ఉన్నవారు, ముఖ్యనేతలు, కార్పొరేటర్లు ఇతర పార్టీల్లోకి వలస పోతుండడంతో పార్టీ నేతలు ఆత్మరక్షణలో పడిపోయారని, ఇప్పుడు కొత్తగా ఎవరినైనా సస్పెండ్ చేస్తే మరింత ఇబ్బంది తలెత్తుతుందనే ఉద్దేశంతోనే చర్యలకు వెనుకడుగు వేస్తున్నట్టున్నారని పార్టీనేతలు కొందరు అభిప్రాయపడుతున్నారు. ఏదిఏమైనా వైసీపీలో ఆరు నెలలు కిందటి పరిస్థితికి పూర్తిభిన్నమైన వాతావరణం ఇప్పుడు ఉందని పార్టీ నేతలే అంగీకరిస్తున్నారు.

భారీగా ఎస్ఐల బదిలీ

... 5వ పేజీ తరువాయి

ఎస్ఐగా పనిచేస్తున్న కరణం వెంకటసురేష్, ఆరిలోవ స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న బరుకు అనిల్‌కుమార్, హార్బర్ క్రైమ్ ఎస్ఐగా పనిచేస్తున్న డి.సూరిబాబు, త్రీటౌన్ ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేస్తున్న కె.నరసింగరావు, మల్కాపురం క్రైమ్ ఎస్ఐగా పనిచేస్తున్న పీడీబీ శంకర్, సీసీఎస్ ఎస్ఐగా పనిచేస్తున్న కె.సత్యనారాయణ, గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేస్తున్న కోటమహంతి శ్రీనివాసరావు, సీసీఎస్ ఎస్ఐగా పనిచేస్తున్న పీవీ రమణారెడ్డి, త్రీటౌన్ క్రైమ్ ఎస్ఐగా పనిచేస్తున్న ఎంవీ రమణ, ఎయిర్‌పోర్ట్ క్రైమ్ ఎస్ఐగా పనిచేస్తున్న డి.రాము, ఫోర్త్‌టౌన్ ఎస్ఐగా పనిచేస్తున్న ఎ.మోహనరావు, దువ్వాడ ఎస్ఐగా పనిచేస్తున్న కె.దేముడునాయుడు, పీఎంపాలెం ట్రాఫిక్ ఎస్ఐగా పనిచేస్తున్న పి.మురళీకృష్ణను శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు బదిలీచేశారు. వారి స్థానంలో రేంజ్‌లో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి మరో 17 మంది ఎస్ఐలను నగరానికి తీసుకున్నారు. వీరికి ఇంకా పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉంటుంది.

ఎడాపెడా రైళ్ల రద్దు

... 5వ పేజీ తరువాయి

రైల్వే 13 సార్లు రద్దు చేయగా, దక్షిణ మధ్య రైల్వే 169 సార్లు రద్దు చేసింది.

- కాకినాడ-విశాఖపట్నం-కాకినాడల మధ్య 17267/68 నంబరుతో నడిచే రైలును తూర్పు కోస్తా రైల్వే 14 సార్లు, దక్షిణ మధ్య రైల్వే 284 సార్లు రద్దు చేశాయి.
- తిరుపతి-విశాఖపట్నం-తిరుపతి మధ్య 22708/707 నంబరుతో తిరిగే రైలును తూర్పు కోస్తా రైల్వే 2 సార్లు, దక్షిణ మధ్య రైల్వే 34 సార్లు రద్దు చేశాయి.
- విశాఖపట్నం-విజయవాడ-విశాఖపట్నం మధ్య 12717/718 నంబరుతో నడిచే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను దక్షిణ మధ్య రైల్వే 59 సార్లు రద్దు చేసింది.
- సికింద్రాబాద్-విశాఖపట్నం-సికింద్రాబాద్‌ల మధ్య 12740/39 నంబరుతో నడిచే గరీబ్‌రథ్ రైలును దక్షిణ మధ్య రైల్వే 271 సార్లు రద్దు చేసింది.
- విశాఖపట్నం-లింగంపల్లి-విశాఖపట్నం మధ్య నడిచే జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలును దక్షిణ మధ్య రైల్వే 44 సార్లు రద్దు చేసింది.
- గుంటూరు-విశాఖపట్నం-గుంటూరు మధ్య 17239/240 నంబరుతో నడిచే సింహాద్రి ఎక్స్‌ప్రెస్ రైలును తూర్పు కోస్తా రైల్వే 2 సార్లు, దక్షిణ మధ్య రైల్వే 284 సార్లు రద్దు చేశాయి
- విశాఖపట్నం-విజయవాడ-విశాఖపట్నం మధ్య నడిచే డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను తూర్పు కోస్తా రైల్వే కేవలం రెండుసార్లు రద్దు చేయగా, దక్షిణ మధ్య రైల్వే 264 సార్లు రద్దు చేసింది.

విమర్శల నేపథ్యంలో రెండు రైళ్ల తాత్కాలిక పునరుద్ధరణ

రైల్వే శాఖ తీరుపై తీవ్రమైన విమర్శలు వెల్లువెత్తడంతో ఈ సంక్రాంతి సీజన్ కోసమని రెండు రైళ్లను తాత్కాలికంగా పునరుద్ధరించింది. విశాఖపట్నం-విజయవాడ మధ్య నడిచే డబుల్ డెక్కర్ ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ను ఈ నెల 5 నుంచి 13వ తేదీ వరకు నడుపుతామని ప్రకటించింది. అలాగే సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను 10వ తేదీ నుంచి 15వ తేదీ వరకు నడుపుతామని షెడ్యూల్ ఇచ్చారు. ఇవి కూడా తాత్కాలికంగానే నడపడం గమనార్హం.

పెందుర్తి ఏఎస్ఐ మురహరి సస్పెన్షన్

... 5వ పేజీ తరువాయి

శ్రీనివాసరావు తెలిపారు. కాగా పెందుర్తి పోలీసు స్టేషన్ సర్కిల్ పరిధిలో రెండు రోజుల వ్యవధిలో ఇద్దరు (వీఆర్‌కు క్రైమ్ ఎస్ఐ సల్మాన్‌బేగ్ సరండర్, ఏఎస్ఐ మురహరి సస్పెన్షన్) వేటు పడడంతో ఇక్కడి పోలీసులు కలవరపడ్డారు.

ఎస్ఐను వీఆర్‌తో వదిలేయడంపై ఆశ్చర్యం

ఇదిలావుండగా ఇనుము చోరీ కేసులో లారీని విడిచిపెట్టేందుకు రూ.3.5 లక్షలు తీసుకున్నట్టు ఆరోపణలు ఎదుర్కొన్న పెందుర్తి క్రైమ్ ఎస్ఐను సస్పెండ్ చేయకుండా వీఆర్‌కు సరెండర్ చేసి వదిలేయడంపై పోలీస్ శాఖలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇనుముతోపాటు లారీని కూడా బాధితులు పట్టుకుని పోలీసులకు అప్పగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోకుండా లంచం తీసుకోవడం తీవ్రంగా పరిగణించాల్సిన విషయమంటున్నారు. పోలీస్ శాఖకు మచ్చతెచ్చేలా వ్యవహరించిన ఎస్ఐపై చర్యలు తీసుకోకుండా వదిలేస్తే మిగిలిన సిబ్బందికి ఎలాంటి సంకేతాలు వెళతాయో ఆలోచించాలని అంటున్నారు. సీపీని కొంతమంది అధికారులే తప్పుదారి పట్టించి ఎస్ఐపై తీవ్రమైన చర్యల్లేకుండా పావులు కదలిపారని పోలీస్ శాఖలో ప్రచారం జరుగుతోంది.

మునిసిపల్ కార్మికుడి ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చిన్న

మధురవాడ, జనవరి 4: సమ్మెలో ఉన్న పారిశుధ్య కార్మికుడు ఆత్మహత్యకు యత్నించడం నగరంలో కలకలం రేపింది. వివరాలిలా ఉన్నాయి. జీవీఎంసీ పరిధిలోని పీఎం పాలెం కారుషెడ్ కూడలి వద్ద గురువారం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అదే ప్రాంతంలో జడ్సీ, ఆరోగ్య శాఖాధికారులు ప్రైవేటు వ్యక్తులతో చెత్త తరలించే పనులు చేపట్టారు. అది చూసి తమ సమ్మెను నిర్వీర్యం చెయ్యడానికి అధికారులు యత్నిస్తున్నారంటూ యాజ్జల చిన్న అనే కార్మికుడు తన వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను శరీరంపై పోసుకున్నాడు. నిప్పంటించుకోబోయాడు. ఈలోగా తోటి కార్మికులు చూసి అడ్డుకుని, నీళ్ల పోశారు. ఈ గందరగోళంలో చిన్నా అపస్మారక స్థితికి చేరుకున్నాడు. దీంతో అతడిని సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించారు. సీఐటీయూ నాయకులు డి.అప్పలరాజు, కిరణ్, శేషుబాబు, రాంబాబు తదితరులు ఆస్పత్రికి చేరుకొని చిన్నా ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతిమ విజయం కార్మికులదేనని అప్పటివరకూ ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మె విషయంలో మొండిపట్టు వీడి వారి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఒకే కుటుంబం ఒకే మాట రెండుగా చీలిపోయాయి

మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు

విశాఖపట్నం, జనవరి 4: మీరు జైల్లో ఉన్న సమయంలో మీ విజయానికి అహర్నిశలూ శ్రమించిన మీ తల్లి, చెల్లి కష్టాన్ని వాడుకుని సీఎం అయ్యాక వారిని తరిమేసిన మాట నిజం కాదా అన్ని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ట్విట్టర్ వేదికగా సీఎం జగన్‌ను ప్రశ్నించారు. మా కుటుంబంలో చిచ్చుపెడుతున్నారంటూ ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. జగనన్న వదిలి బాణాన్ని అని రాష్ట్రమంతా తిరిగిన చెల్లికి అన్యాయం చేయమని ఏపార్టీ చెప్పిందన్నారు. ఆస్తి పంపకాల్లో అన్యాయం చేయమని, ఎంపీ టికెట్ ఇవ్వొద్దని ఏ నాయకుడు చెప్పాడని ప్రశ్నించారు. తండ్రిని హత్యచేసిన వారిని శిక్షించాలని ఢిల్లీలో కాళ్లు అరిగేలా తిరుగుతున్న మరో చెల్లికి న్యాయం చేయవద్దని ఎవరు చెప్పారో అందరికీ తెలుసన్నారు. తల్లిదండ్రులను, కుటుంబాన్ని గౌరవించలేని వారు సమాజాన్ని గౌరవించలేరని మీ ద్వారా నిరూపితమయిందన్నారు. మీరు పెట్టిన చిచ్చే రానున్న ఎన్నికల్లో మిమ్మల్ని చుట్టుముడుతుందనే విషయం గమనించాలని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆరిలోవ, జనవరి 4 : విమ్స్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు జేఈస్ర్తీ ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తోటగరువు, బీఎన్ఆర్ నగర్, హనుమంతవాక జంక్షన్ కొండవాలు ప్రాంతం, రెవెన్యూ కాలనీ, విశాలాక్షి నగర్, తదితర ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు.

కొమ్మాది : కొమ్మాది సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఎన్‌టీఆర్ ఫీడర్ నిర్వహణ పనుల దృష్ట్యా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నరేష్ తెలిపారు. కె2 కాలనీ, కె1 కాలనీ, కె 3 కాలనీ, నవోదయ విద్యాలయం, బక్కన్నపాలెం, ఎన్‌టీఆర్ కాలనీ, లచ్చిరాజు లేఅవుట్, రైల్వే లేఅవుట్, చైతన్య ఇంజనీరింగ్ కళాశాల, పోలీస్ బెటాలియన్ ప్రాంతాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని సూచించారు.

తగరపువలస : చిట్టివలస సబ్‌స్టేషన్ పరిధిలోని సంగివలస ఫీడర్ నిర్వహణ పనుల వల్ల శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నారు. సంగివలస, కాలనీ, సబ్బివానిపేట, ఎడదాసరిపేట, చిల్లపేట, జీరుపేట ప్రాంతాలకు సరఫరా ఉండదు.

భక్తుల కోసం బస్సు సౌకర్యం

కొమ్మాది, జనవరి 4 : నగరంలోని కనక మహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం మధురవాడ నుంచి ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్టు జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఈఎన్ఎస్ చంద్రరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఈ బస్సు సదుపాయం వచ్చే గురువారం వరకూ భక్తులకు అందుబాటులో ఉంటుందన్నారు.

నేత్ర సమస్యల పట్ల అప్రమత్తం

ఆరిలోవ, జనవరి 4 : ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో గురువారం పాలకుర్తి ఫౌండేషన్ సహకారంతో పాలకుర్తి ఎయిడ్ విజన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి క్యాంపస్ హెడ్ డాక్టర్ భావిక పాంచాల్ మాట్లాడుతూ కార్టికల్ దృష్టి లోపం నివారణ కేంద్రం దృష్టి లోపం ఉన్న చిన్నారులకు వరం వంటిదన్నారు. పిల్లలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అలాగే నేత్ర సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ ఫర్ విజన్ రిహాబిలిటేషన్ అధిపతి డాక్టర్ క్రిస్టిలి, పాలకుర్తి ఫౌండేషన్‌కి చెందిన ప్రశాంత్ పాలకుర్తి, విజన్ ఎయిడ్ వ్యవస్థాపకులు రామకృష్ణంరాజు, రేవతి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

కొమ్మాది, జనవరి 4 : వైఎస్సార్ కాలనీలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు 5వ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత గురువారం శంకుస్థాపన చేశారు. వైఎస్సార్ కాలనీలో కింద బ్లాకులకు మెట్ల మార్గం, సాయిరాం కాలనీ, మారికవలస, రాజీవ్ గృహకల్ప, బొట్టవానిపాలెం శ్మశాన వాటికల అభివృద్ధికి, స్వతంత్రనగర్ నుంచి నగరంపాలెం రోడ్డుకు అనుసంధానం చేసే కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మారికవలసలో 'జగనన్న సురక్ష'

కొమ్మాది, జనవరి 4 : పేదల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేసిందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన మారికవలసలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడారు.

కనక మహాలక్ష్మి అమ్మవారికి పూజలు

ఆరిలోవ, జనవరి 4 : ఎస్‌కేఎల్ఎం నగర్‌లో ఉన్న కనక మహాలక్ష్మి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. మార్గశిర మాసం నాలుగో గురువారం కావడంతో మహిళలు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి, పూజలు జరిపారు. వేకువ జాము నుంచి ఆలయం వద్ద రద్దీ నెలకొంది.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

ఆనందపురం, జనవరి 1 : మండలంలోని గిడిజాల సమీపంలో ఉన్న సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాలలో పాలిఫెస్ట్ 2024 సందర్భంగా గురువారం వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. వీటిని కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. నారాయణరావు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి ఇటువంటి ప్రాజెక్టులు ఎంతగానో దోహదపడతాయన్నారు.కాగా మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ విభాగాలకు చెందిన 180 ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.

సినిమా గైడ్

- **డెవిల్ :** జగదాంబ, వెంకటేశ్వర, కామేశ్వరి, శ్రీకన్య, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ (గోపాలపట్నం), కన్య-1 (గాజువాక), దుర్గ (మధురవాడ), తాతా (తగరపువలస)
- **బబుల్ గమ్ :** శరత్, రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **సలార్ :** మెలోడి, సంగం, శారద, శ్రీవెంకటేశ్వర, శ్రీరామ, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత(శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), శ్రీరాములమ్మ (తగరపువలస)
- **పిండం :** మోహిని (గాజువాక)
- **ఆక్వామెన్ :** సుకన్య(గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక)
- **హాయ్ నాన్న :** మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్ (గాజువాక), గణేష్ (తగరపువలస),

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 25, టమాటా 24, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 54, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 52, బీరకాయలు 50, ఆనపకాయలు 26, కాలీఫ్లవర్ 24, క్యాబేజ్ 20, క్యారేట్ 46, దొండకాయలు 36, బంగాళా దుంపలు 18, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 80, అల్లం (పాతది) 100, బరబటి 50, ముల్లంగి 22, నిమ్మకాయలు (కిలో) 60, గోరుచిక్కుడు 44, దోస కాయలు 30, వె ల్లుల్లి (పెద్దవి) 220, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 36 , ఆగాకర 84, పొటల్స్ 56, కీరదోస 24, కాప్సికమ్ 76, పొట్లకాయ (పెద్దది) 15, చేమదుంపలు 50, చిలగడదుంపలు 24 , కంద 50, దేముడు చిక్కుడు 40, కొండఉసిరి 60, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 60, బొప్పాయి 28, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	625
విజయనగరం	629
శ్రీకాకుళం	629

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	75
ఫారం ధర	--	95
విత్ స్కిన్	--	160
స్కిన్‌లెస్	--	170

మరికొన్ని సిటీ వార్తలు పేజీ I లో..

టీడీపీతోనే బడుగుల అభ్యున్నతి

- తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి
- 9వ వార్డులో భవిష్యత్తుకు గ్యారంటీ


ఎన్టీఆర్ కూడలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి

విశాలాక్షినగర్, జనవరి 4 : బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. 9వ వార్డు జోడుగుళ్లపాలెంలో నాయకులు వేజెళ్ల సుబ్బరాజు, గరికిన నూకరాజు, టీడీపీ వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు ఆధ్వర్యంలో గురువారం భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులో ప్రజా అవసరాలకు ఉపయోగపడే ప్రభుత్వ స్థలాలైన తుఫాన్ బిల్డింగ్, విశాలాక్షినగర్‌లోని పోలీసు క్వార్టర్స్‌తో పాటు రుషికొండలోని స్థలాలను ముఖ్యమంత్రి జగన్ ఆక్రమణకు ప్రయత్నించగా తాను న్యాయస్థానాలను ఆశ్రయించి అడ్డుకున్నానని గుర్తుచేశారు. ఆయా స్థలాలను భవిష్యత్తులో ప్రజా అవసరాలకు వినియోగిస్తామని తెలిపారు. అనంతరం ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత ఆయన జోడుగుళ్లపాలెం కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్‌చార్జి బుడుమూరి గోవింద్, శ్రీనివాసరెడ్డి, ఎం. చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించాలని జూనియర్ ఆర్టిస్టుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ ఆర్టిస్టులు

మద్దిలపాలెం, జనవరి 4 : నగరంలో జరుగుతున్న సినీ,టీవీ షూటింగ్‌ల్లో స్థానిక కళాకారులకు అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ అండ్ టీవీ జూనియర్ ఆర్టిస్ట్ యూనియన్ అధ్యక్షురాలు వై.నాగేంద్రమ్మ డిమాండ్ చేశారు. మద్దిలపాలెంలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద జూనియర్ ఆర్టిస్టులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న షూటింగ్‌లకు ఇతర ప్రాంతాల నుంచి ఆర్టిస్టులను తీసుకురావడం వల్ల స్థానిక కళాకారులు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. నటనే జీవనాధారంగా ఎంతోమంది కళాకారులు ఉన్నారని, బయట వారు రావడం వల్ల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఆర్టిస్టులు జి.శివ, నూకరత్నం, రాధ, చింతల అమ్మాజీ, ఏలూరు లక్ష్మి, సత్యవతి, ప్రభావతి పాల్గొన్నారు.


శేష పాన్పుపై ఉన్న స్వామివారు

శేష పాన్పుపై వెంకన్న

సింహాచలం, జనవరి 4 : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం అనుబంధంగా ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు భక్తులకు గురువారం శేషశయనుడిగా దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా అర్చకులు ఉత్సవమూర్తులను శేషపాన్పుపై శయనించిన విష్ణువుగా స్వామిని,అతనికి సమీపంలో ఆండాళ్‌గా అమ్మవారిని అలంకరించారు. ఈమేరకు సుప్రభాత, ప్రభాత సేవల తరువాత ఆండాళ్ అమ్మవారి తిరుప్పావై పాశురాన్ని భక్తులతో కలిసి అర్చకులు విన్నపాలు చేశారు.

కొమ్మాదిలో 'వికసిత్ భారత్'

కొమ్మాది, జనవరి 4 : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇండిపెండెంట్ డైరెక్టర్ కేఎన్‌వీ చక్రవర్తి కోరారు. గురువారం కొమ్మాది గ్రామంలో జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన ప్రధానమంత్రి బీమా సురక్ష యోజన, జీవన జ్యోతి, ఆవాస్ యోజన, ఆయుష్మాన్ భారత్, ముద్రా యోజన, జన్‌ధన్ యోజన, తదితర పథకాలు గురించి వివరించారు. కార్యక్రమంలో జడ్పీ కనకమహాలక్ష్మి, యూపీహెచ్‌సీ వైద్యుడు సాల్మన్‌రాజు, బీజేపీ నాయకులు అనిల్, చింతాడ మోహనరావు, శ్రీనివాసరావు, ప్రసాదరావు, రాజు, నాగరాజు పాల్గొన్నారు.

మూలకుద్దు, రేఖవానిపాలెంలో...

భీమునిపట్నం (రూరల్) : మండలంలోని మూలకుద్దు, రేఖవానిపాలెం గ్రామాల్లోనూ వికసిత్ భారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి కంటుభుక్త రామానాయుడు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు విజయకుమారి, దుర్గాదేవి, 3వ వార్డు బీజేపీ అధ్యక్షురాలు కె. సునీత, ప్రధాన కార్యదర్శి పోలుబోతు విజయ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సంఘీభావం

కొమ్మాది, జనవరి 4 : మున్సిపల్ కార్మికులు పది రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని టీడీపీ విశాఖ పార్లమెంట్ అధికార ప్రతినిధి దాసరి శ్రీనివాస్ అన్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించిన మున్సిపల్ కార్మికులకు ఆయన జనసేన నాయకుడు సంతోష్‌నాయుడుతో కలిసి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు నొడగల జానకీరామ్, సర్వ దేవుళ్లు, బబ్బేలు, జనసేన నాయకులు సంతోష్‌నాయుడు, ఏడో వార్డు జనసేన అధ్యక్షుడు నాగోతి నాయుడు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు కొమ్మాది రిక్షా కాలనీలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మానసిక ఆస్పత్రిని సందర్శించిన బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనర్

పెదవాల్తేరు, జనవరి 4 : చినవాల్తేరులోని ప్రభుత్వ మానసిక ఆస్పత్రిని బంగ్లాదేశ్‌కు చెందిన డిప్యూటీ హై కమిషనర్ షల్లీ సలేహిన్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్య సదుపాయాలు, నిర్వహణ, భోజన సదుపాయం, తదితర వాటిని పరిశీలించారు. ఆయనతో పాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేవీ రామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

వెంకన్న ఆలయంలో రామావతార ఉత్సవం

ఎంవీపీ కాలనీ, జనవరి 4 : ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరులో ఉన్న వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం స్వామివారికి రామావతారంలో శేష వాహనంపై తిరువీధి ఉత్సవం నిర్వహించారు. శనివారం వేంకటేశ్వరస్వామి వజ్రకవచధారణలో దర్శనమిస్తారని ఆలయ కమిటీ పేర్కొంది.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పద్మనాభం, జనవరి 4 : మండలంలోని రేవిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కమిటీ సభ్యుడు మరగడ అప్పారావు పదో తరగతి విద్యార్థులకు సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. వైసీపీ మండల అధ్యక్షుడు కె. లక్ష్మణరావు చేతుల మీదుగా 62 మంది విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సూరప్పడు, పాఠశాల హెచ్ఎం శంకరరావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శంకరరావు పాల్గొన్నారు. అలాగే అనంతవరం గ్రామంలో విద్యార్థులకు ట్యాబులు, స్టడీ మెటీరియల్‌ను ఎంపీపీ కె. రాంబాబు పంపిణీ చేశారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న 40 మందికి ట్యాబులు, 38 మంది పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణకుమార్, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార పాఠశాలను విలీనం చేయాలని వినతి

ఎంవీపీ కాలనీ, జనవరి 4 : నగరంలోని వాసవానిపాలెంలో ఉన్న ప్రభుత్వ మత్స్యకార పాఠశాలను రాష్ట్ర విద్యా శాఖలో విలీనం చేయాలని కోరుతూ మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ పేర్ల విజయ్‌చందర్ ఆ శాఖ కమిషనర్ కన్నబాబుకు గురువారం వినతిపత్రం ఇచ్చారు. దీనిపై స్పందించిన కమిషనర్ తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో డైరెక్టర్ ఎస్.కె.లాల్, పాఠశాల చైర్మన్ భాస్కరరావు, తీర ప్రాంత సంఘం అధ్యక్షుడు మూగి శ్రీరామ్మూర్తి ఉన్నారు.

రాముడి చిత్రపటంతో ఊరేగింపు

తగరపువలస, జనవరి 4 : తగరపువలస మెయిన్ రోడ్డులో తగరపువలస, భీమిలి పట్టణానికి చెందిన పలు రాజకీయ పార్టీల నాయకులు ఆధ్యాత్మిక వేత్తలు రాముని చిత్రపటంతో గురువారం ఊరేగింపు చేప ట్టారు. రాముడి భావ జాలం ప్రతి హిందువు పాటించాలని కోరుతూ ఈ ప్రచారాన్ని నిర్వహించారు. చిట్టివలస రామాలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు తగరపువలస మెయిన్ రోడ్డు మీదుగా ఆదర్శనగర్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ప్రవచనకర్త రామకృష్ణానంద, జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, నాయకులు రమేష్, రాము, సర్పంచ్ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన



సింహాచలం, జనవరి 4 : వరాహలక్ష్మీనృసింహునికి గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. ఆలయ పద్మనిధి నుంచి బంగరు సంపెంగలు తీసి భక్తులతో స్పృశింపజేసి వారి గోత్రనామాలతో సంకల్పించి, షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం నృసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ఒక్కొక్క నామానికి ఒక్కొక్క బంగరు సంపెంగతో పూజ చేశారు. మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేష వస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై స్వామివారి నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు.

నిత్యాన్నప్రసాద పథకానికి రూ.5 లక్షల విరాళం

సింహాచలం, జనవరి 4 : వరాహలక్ష్మీనృసింహస్వామి నిత్యాన్న ప్రసాద పథకానికి శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన రఘుపాత్రుని హేమలత రూ. 5 లక్షలు విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తాన్ని నగదు రూపంలో అన్న ప్రసాద విభాగం ఏఈఓ పాలూరి నరసింగరావుకు గురువారం ఉదయం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అధికారులు అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

విలువలతో కూడిన బోధన అవసరం : మేయర్



వేడుకలను ప్రారంభిస్తున్న అతిథులు

సిరిపురం, జనవరి 4 : ఉపాధ్యాయులు విద్యార్థులకు విలువలతో కూడిన బోధన అందించాలని మేయర్ హరి వెంకటకుమారి అన్నారు. గురువారం సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఇస్కాన్ అనుబంధ విద్యా సంస్థ డివైన్ టచ్ 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నైతిక విలువలతో కూడిన బోధన అందించడమే కాకుండా మనసంస్కృతీ సాంప్రదాయాలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నేహాదాస్, ఇస్కాన్ జీబీసీ చైర్మన్ రేవతి రామన్‌దాస్, భక్తివేదాంత మిషన్ స్కూల్ ప్రిన్సిపాల్ భక్తిక, సాంబదాస్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వంటా వార్పు

ఎంవీపీ కాలనీ, జనవరి 4 : తమ డిమాండ్ల కోసం సమ్మె చేపట్టిన పారిశుధ్య కార్మికులు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసే దిశగా ముందుకు సాగుతున్నారు. గురువారం ఎంవీపీ కాలనీలో పారిశుధ్య వాహనాలు నిలిపే స్థలం వద్ద వంటా వార్పు నిర్వహించారు. అక్కడే వంటలు చేసి, భోజనాలు చేశారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఆరిలోవ : ఆరిలోవ డంపింగ్ యార్డులోకి చెత్త తరలిస్తున్న క్లాప్ వాహనాలను, లారీలను లోపలకు వెళ్ల కుండా అడ్డుకున్న సీపీఎం నాయకులను, పారిశుధ్య కార్మికులను ఆరిలోవ పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. చెత్త వేస్తున్న వారిని అడ్డుకోవడం, వారితో వాగ్వాదం చేసి శాంతి భద్రతలకు విఘాతం కలిగిం చినందుకు వారిని అదుపులోకి తీసుకున్నామన్నారు.

సాగర్‌నగర్ : పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండడంతో సాగర్‌నగర్, రుషికొండ, గుడ్లవానిపాలెం ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయింది. ప్రతి వీధిలోనూ చెత్త గుట్ట గుట్టలుగా పేరుకుపోయి విపరీతమైన దుర్గంధం వస్తోంది. ఒకవైపు కరోనా కేసులు, మరోవైపు పారిశుధ్య లోపంతో ప్రజలు భయపడుతున్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైసీపీ పాలన



పింఛన్లు ఇస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

భీమునిపట్నం, జనవరి 4 : గత ప్రభుత్వాలు అధికారం కోసం తపిస్తే తమ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. గురువారం సాయంత్రం కె.నగరపాలెం-1 సచివాలయంలో ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి ఏడుకొండలరావు, జడ్పీ రాము, తదితరులు పాల్గొన్నారు.

నృసింహ దీక్షల విరమణకు ఏర్పాట్లు

సింహాచలం, జనవరి 4 : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో శనివారం జరిగే నృసింహ దీక్షల విరమణకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానం ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి, అధికారులతో కలిసి గురువారం క్షేత్ర పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ భక్తుల దర్శనాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దీక్షాపరులకు ప్రత్యేక క్యూలో దర్శనాలు కల్పిస్తామన్నారు. ఆ రోజు ఉదయం 6.30 గంటలకు మాలధారులు సింహగిరికి చేరుకుని పడమర మాడవీధి జోడుభద్రాల వద్ద నృసింహ మండపం ద్వారా ప్రవేశించి సుపథ మండపంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలో కల్యాణ మండపం మీదుగా వెళ్లి నిత్య కల్యాణాన్ని చూస్తూ ఆలయ ధ్వజస్తంభం ముందు నుంచి ఆలయంలోకి ప్రవేశిస్తా రని చెప్పారు.అందుకు తగ్గట్టుగా క్యూలు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. దర్శనం అనంతరం దక్షిణ రాజగోపురం నుంచి బయటకు వచ్చి శ్రీగోకులం వద్ద ప్రత్యేకంగా సిద్ధం చేసిన వేదిక వద్ద ఇరుముడులు సమర్పించి దీక్ష విరమణ చేయాలన్నారు.

చందనస్వాములకు దేవస్థానం ఉచిత లడ్డూ ప్రసాదాన్ని అందజేస్తుందని, అలాగే ఉచిత రవాణా, నిత్యాన్న ప్రసాద విభాగం ద్వారా భోజన సౌకర్యం కల్పి స్తాన్నామన్నారు. ఈఓతో పాటు ఏఈఓలు భ్రమరాంబ, నరసింగరావు, ఈఈ డిజి శ్రీనివాస రాజు, పర్యవేక్షణాధికారి వెంకటరమణ, ప్రధానార్చకుడు జి శ్రీనివాసాచార్యులు ఉన్నారు.

ఆకట్టుకున్న గాన కచేరి

భీమునిపట్నం, జనవరి 4 : పట్టణంలోని శ్రీ శారదా రామకృష్ణ సంఘంలో జరుగుతున్న శారదామణి దేవి జయంతోత్సవాల్లో భాగంగా గురువారం సారిపల్లి శ్రీ రామకృష్ణ భక్త సమాజం బృందంతో గాన కచేరి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శారదేశ్వరా నందపురి, ఆధ్యాత్మిక గురువు రామకృష్ణ పరమహంస భక్తులు పాల్గొన్నారు.

వృద్ధులకు వితరణ

ఎంవీపీ కాలనీ, జనవరి 4 : జీవీఎంసీ, ఇండియన్ రెడ్ క్రాస్ సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న వసతి గృహంలోని వృద్ధులకు ఎంవీపీ కపుల్స్ క్లబ్ గురువారం మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసింది. పెదవాల్తేరులోని వసతి గృహంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వితరణ దాత వి. గాయత్రి, క్లబ్ సభ్యులు కాపుగంటి వెంకట రమణమూర్తి, పల్లపోతు హరగోపాల్, చెరకు కృష్ణారావు, ఏవీ రామకృష్ణారావు, గరుడ సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో గెలుపే లక్ష్యం కావాలి : వంశీకృష్ణ


వంశీకృష్ణను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు

మద్దిలపాలెం, జనవరి 4 : విశాఖ అర్బన్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లోనూ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. అర్బన్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి నగరానికి వచ్చిన ఆయనకు గురువారం శివాజీపాలెంలోని తన నివాసంలో జనసైనికులు, అభిమానులు పెద్ద ఎత్తున స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ ఎన్నికలకు ఎన్నో రోజులు లేవని, పార్టీని జోరుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని బూత్ స్థాయి నుంచి రెండు పార్టీలను బలపరచాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైసీపీని ఓడించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్లు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నాటిక పోటీలు ప్రారంభం


పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న పైడా కృష్ణప్రసాద్

మద్దిలపాలెం, జనవరి 4 : పిఠాపురం కాలనీ కళాభారతి ఆడిటోరియంలో అజో-విభో-కందాళం ఫౌండేషన్, రైటర్స్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం నుంచి నాటిక పోటీలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు శిథిలజీవి, నాటకమా నమస్తే, నాలోన నీవే నాటికలు ప్రదర్శించారు. పెందుర్తికి చెందిన నటరాజ్ ఆర్ట్స్ డ్రమటిక్ అసోసియేషన్ నిర్వహణలో పిళ్లా సన్యాసిరావు దర్శకత్వం వహించిన శిథిలజీవి నాటిక అలరించింది. కొప్పోలుకు చెందిన పండు క్రియేషన్స్ ఆధ్వర్యంలో బి. నాగేశ్వరరావు దర్శకత్వంలో నాటకమా నమస్తే ప్రదర్శన కనువిందుగా సాగింది. అలాగే గుంటూరు కరణం సురేష్ మెమోరియల్ థియేటర్స్ నిర్వహణలో బి. రామకృష్ణ దర్శకత్వం వహించిన నాలోన నీవే నాటిక ప్రదర్శన కళాభిమానుల మన్ననలు పొందింది. ముందుగా ఏపీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి. రవికృష్ణ, కళాభారతి ట్రస్టీ పైడా కృష్ణప్రసాద్, రైటర్స్ అకాడమీ అధినేత రమణమూర్తి, కందాళం ఫౌండర్ అప్పాజోస్యుల సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం రమణమూర్తి మాట్లాడుతూ నాటిక పోటీలకు 29 ఎంట్రీలు వస్తే అందులో తొమ్మిది ఎంపిక చేశామన్నారు. శనివారం వరకు ప్రదర్శనలు ఉంటాయని ఆయన చెప్పారు.